SK1 one NEWS HD
www.seemakiranam.com
www.seemakiranamnews.com
epaper.seemakiranam.com
ప్రచురణ : కర్నూలు & శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లా.
సమాజాభివృద్ధి కోసం మా అక్షర పోరాటం
సీమకిరణం
SEEMAKIRANAM TELUGU DAILY
ఎడిటర్ : యస్. నజీర్ అహ్మద్ బాషా
జాతీయ తెలుగు దినపత్రిక
PUBLISHED BY : KURNOOL & SRI POTTI SRIRAMULU NELLORE DISTRICT
ప్రచురణ : కర్నూలు, నెల్లూరు. | ఎడిటర్ : ఎస్. నజీర్ అహ్మద్ భాష | సంపుటి : 08 సంచిక : 861 | పేజిలు : 04, వెల రూ. 2 రూ/ | మంగళవారం 21-07-2026

# రాహుల్ వయసుపై ప్రధాని మోదీ చురకలు



- ప్రైవేట్ రాకెట్ ప్రయోగించిన యువతను ప్రశంసించిన ప్రధాని మోదీ
- రాహుల్ గాంధీ వయసును ఉద్దేశించి పరోక్షంగా సెటైర్లు
- స్కైరూట్ బృందం సగటు వయసు 28 అని వెల్లడి
- తాను మాట్లాడుతోంది 56 ఏళ్ల యువకుడి గురించి కాదన్న ప్రధాని

**ఢిల్లీ :**
పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. భారత్‌లో తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన హైదరాబాద్ స్టార్టప్ 'స్కైరూట్ ఏరోస్పేస్'ను అభినందిస్తూనే, రాహుల్ గాంధీ వయసును ఉద్దేశించి ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం పార్లమెంట్ సమావేశాల సందర్భంగా మీడియాతో మాట్లాడిన ప్రధాని, దేశం సాధించిన ఇటీవలి విజయాలను ప్రస్తావించారు. "భారత్ నుంచి తొలి ప్రైవేట్ రాకెట్‌ను ప్రయోగించిన స్కైరూట్ స్టార్టప్ బృందం సగటు వయసు కేవలం 28 ఏళ్లేనని నాకు తెలిసింది. ఇంతటి అతి పిన్న వయస్కులు ఈ ఘనతను సాధించారు. నేను ఇక్కడ 56 ఏళ్ల 'యువకుడి' గురించి - మిగతా 2 లో

# పాకిస్థాన్‌ను చుట్టుముట్టిన ఆర్థిక సంక్షోభం

- కోరలు చాస్తున్న పేదరికం
- పాకిస్థాన్‌లో ప్రమాదకర స్థాయికి చేరిన పేదరికం
- పట్టణాలతో పోలిస్తే గ్రామాల్లోనే ఎక్కువ ప్రభావం
- అధిక ద్రవ్యోల్బణం, ఆర్థిక సంక్షోభాలే ప్రధాన కారణాలు
- వృద్ధి ఫలాలు సంపన్నులకే.. పేదలకు తప్పని కష్టాలు




**ఢిల్లీ :**
దాయాది దేశం పాకిస్థాన్‌ను పేదరికం చుట్టుముడుతోంది. గడిచిన ఆరేళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఒడిదొడుకులకు లోనుకావడంతో నిరుపేదల సంఖ్య ప్రమాదకర స్థాయిలో పెరిగిపోయింది. వరుస ఆర్థిక సంక్షోభాలు, అధిక ద్రవ్యోల్బణం, బలహీనమైన వృద్ధి రేటు వంటి కారణాలతో కుటుంబ ఆదాయాలు గణనీయంగా క్షీణించాయి. ఫలితంగా దేశ - మిగతా 2 లో

# కేంద్రమంత్రి జేపీ నడ్డాతో కాక్రోచ్ జనతా పార్టీ నాయకుల భేటీ

- నీట్ వివాదంపై కేంద్రమంత్రి నడ్డాతో భేటీ
- విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్
- ఢిల్లీలో 'చలో సంసద్' ర్యాలీ... నిరసనకారులపై లాఠీఛార్జ్
- డిమాండ్లు నెరవేరే వరకు ఆందోళనలు కొనసాగుతాయని స్పష్టీకరణ



**ఢిల్లీ :**
నీట్-యూజీ 2026 ప్రశ్నాపత్రం లీకేజీతో పాటు పలు పరీక్షల్లో జరిగిన అవకతవకలపై ఆరోపణలు వెల్లువెత్తడంతో ఢిల్లీలో నిరసనలు ఉధృతమయ్యాయి. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో ఆందోళనలు కొనసాగుతున్న నేపథ్యంలో, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతలు సోమవారం కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో భేటీ అయ్యారు. సీజేపీ ప్రతినిధులు సౌరవ్ దాస్, అశు తోష్ రంకా ఢిల్లీలోని నడ్డా నివాసంలో సుమారు 10 నిమిషాల పాటు సమావేశమై, తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ సమస్యపై అంతర్గతంగా ఉన్నత స్థాయిలో చర్చిస్తామని మంత్రి హామీ ఇచ్చారని, అయితే ఎటువంటి నిర్దిష్ట హామీలు లభించలేదని సౌరవ్ దాస్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు శాంతియుత పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం రోజే సీజేపీ - మిగతా 2 లో



# విద్యార్థులు చదువుకే పరిమితం కాకూడదు

- మంచి సంస్కారం అలవర్చుకోవాలి
- రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత
- విజయనగరంలో ఘనంగా 'షైనింగ్ స్టార్స్' అవార్డుల ప్రదానోత్సవం
- ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత
- ప్రతిభావంతులైన 223 మంది విద్యార్థులకు సత్కారం

**అమరావతి :**
"రాష్ట్రంలో విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తోంది. మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో విద్యా వ్యవస్థలో ఎన్నో సానుకూల మార్పులు వస్తున్నాయి" అని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. విజయనగరంలో 'షైనింగ్ స్టార్స్' అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి అనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆమె ఘనంగా సత్కరించి అభినందించారు. - మిగతా 2 లో

## పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల తరహాలో

# రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- డాక్యుమెంట్ రైటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల వల్ల కలిగే లాభాలను ప్రజలకు చెప్పాలి
- ఆర్టీజీఎస్‌లో వివిధ శాఖలపై సీఎం చంద్రబాబు సమీక్ష
- సబ్-రిజిస్ట్రార్ ఆఫీసుల ప్రైవేటీకరణ వార్తలు అవాస్తవమన్న చంద్రబాబు
- పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల మాదిరిగా రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు అని వివరణ
- దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని అధికారులకు సీఎం ఆదేశం




**అమరావతి :**
సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రైవేటీకరిస్తున్నారంటూ కొందరు పని గట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని దీనిపై వాస్తవాలను ప్రజలకు తెలపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని ఆయన వెల్లడించారు. రిజిస్ట్రేషన్ సేవలను మరింత సులభతరం చేసేలా రిజిస్ట్రేషన్ సేవా కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ సెంటర్లో వివిధ శాఖల పనితీరుపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. ప్రజలకు మెరుగైన రిజిస్ట్రేషన్ సేవలందించేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రైవేటీకరిస్తున్నారనే అంశం సమీక్షలో ప్రస్తావనకు వచ్చింది. ఇది ప్రైవేటీకరణ ఎంత మాత్రమూ కాదని స్పష్టంచేశారు. పాస్ పోర్టు సేవా కేంద్రాల తరహాలోనే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు పని చేస్తాయని తెలిపారు. పాస్ పోర్టు సేవా కేంద్రాల పనితీరు ఏ విధంగా జరుగుతుందో, ఆ తర్వాత ప్రక్రియ ఏ విధంగా జరుగుతుందో వివరించాలని సూచించారు. పాస్ పోర్టు సేవా కేంద్రాలు అందుబాటులోకి వచ్చాక పాస్ పోర్టు ప్రాసెసింగ్ అనేది చాలా సులువైందన్న సీఎం, ఇదే తరహాలో రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల పనితీరు ఉంటుందని తెలిపారు. అయితే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల విషయంలో కొందరు పనిగట్టుకుని - మిగతా 2 లో

## తల్లీ-బిడ్డ ఎక్స్‌ప్రెస్‌కు

# కొత్త రూపు




- నూతన వాహనాలను పరిశీలించిన సీఎం చంద్రబాబు
- రాష్ట్రవ్యాప్తంగా 500 నూతన వాహనాలతో సేవలు అందించనున్న ప్రభుత్వం
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన బాలింతలకు ఉచిత, సురక్షిత రవాణా
- జీపీఎస్, ఏసీ, సీట్ బెల్టుల వంటి ఆధునిక సౌకర్యాలతో వాహనాల రూపకల్పన
- ఏటా సుమారు 2.75 లక్షల మంది బాలింతలకు ప్రయోజనం చేకూరనున్న అంచనా




## డెంగీపై భారత్‌కు

# తొలి వ్యాక్సిన్

- 'క్యూడెంగా'కు ఆమోదం!
- భారత్‌లో తొలి డెంగీ వ్యాక్సిన్‌కు ఆమోదం
- నాలుగు రకాల డెంగీ వైరస్‌ల నుంచి రక్షణ
- ప్రయోగాల్లో ఆస్పత్రి చేరికలను 84 శాతం తగ్గించిన వైనం

**ఢిల్లీ :**
వర్షాకాలం మొదలైతే డెంగీ భయం వెంటాడటం మనకు కొత్త కాదు. ఏటా వేలాది మంది ఆసుపత్రుల పాలవుతుంటారు. అలాంటి డెంగీ నియంత్రణలో భారత్ కీలక ముందడుగు వేసింది. దేశంలో తొలి డెంగీ - మిగతా 2 లో




## తెలంగాణలో క్యూఆర్ కోడ్‌తో

# కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు

- 3 నెలల బియ్యం ఒకేసారి పంపిణీ
- క్యూఆర్ కోడ్‌తో పటిష్ఠ భద్రతా ఫీచర్లతో కొత్త కార్డుల రూపకల్పన
- ఆగస్టు నుంచి మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ
- రేషన్ సరుకులకు జులై 31 లోగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవడం తప్పనిసరి

**హైదరాబాద్ :**
తెలంగాణలో అర్హులైన పేదలకు కొత్త రేషన్ కార్డులు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ప్రస్తుతం వినియోగిస్తున్న కాగితపు కార్డుల స్థానంలో అత్యాధునిక టెక్నాలజీతో కూడిన ప్లాస్టిక్ - మిగతా 2 లో

# తెలంగాణలో ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా ఉంది



- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలి
- ఎల్‌నినో ప్రభావంపై అధికారులతో సమీక్ష నిర్వహించిన ప్రభుత్వం
- తెలంగాణ రాష్ట్రంలోనే ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా ఉందన్న మంత్రి ఉత్తమ్ కుమార్

**హైదరాబాద్ :**
రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినోను - మిగతా 2 లో

# కేంద్రంపై సీఎం రేవంత్ రెడ్డి ఫైర్

- ఢిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జ్
- ఢిల్లీలో నీట్ విద్యార్థుల ఆందోళనపై పోలీసుల లాఠీఛార్జ్
- కేంద్ర ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించిన సీఎం రేవంత్ రెడ్డి
- ప్రశ్నిస్తున్న యువతపై దాడులు బీజేపీ భయానికి నిదర్శనమన్న సీఎం
- కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్
- విద్యార్థులకు అండగా ఉంటానని స్పష్టం చేసిన రేవంత్



**హైదరాబాద్ :**
నీట్-యూజీ 2026 పరీక్ష నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలపై దేశ రాజధాని ఢిల్లీలో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసుల చర్యను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. శాంతియుతంగా ఆందోళన నిర్వహిస్తున్న వారిపై లాఠీఛార్జ్ చేయడం, బాష్పవాయువు ప్రయోగించడం అత్యంత దారుణమని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో విద్యార్థులకు ఆయన తన పూర్తి మద్దతు ప్రకటించారు. సోషల్ మీడియా వేదికగా స్పందించిన రేవంత్ రెడ్డి, విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు వారి గొంతు నొక్కేందుకు పోలీసు బలగాలను ప్రయోగిస్తోందని ఆరోపించారు. "నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పడిన ప్రతి దెబ్బ.. ప్రశ్నలన్నా, నిజమన్నా బీజేపీకి ఉన్న భయాన్ని బహిర్గతం చేస్తోంది. నీట్ కుంభకోణంపై కేంద్రం ప్రభుత్వం జవాబుదారీతనం వహించాలి. దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు నేను - మిగతా 2 లో

# సంపాదకీయం

## విక్రమ్-1తో అంతరిక్ష రంగంలో నూతన శకం

(సి.హెచ్.ప్రతాప్)



భారత అంతరిక్ష రంగం మరో చారిత్రక మైలురాయిని చేరుకుంది. ఇటీవల భారతీయ ప్రైవేటు సంస్థ అభివృద్ధి చేసిన విక్రమ్-1 రాకెట్ విజయవంతంగా కక్ష్యలోకి చేరడం దేశ అంతరిక్ష చరిత్రలో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలికింది. ఈ విజయం కేవలం ఒక సంస్థ సాధించిన ఘనత మాత్రమే కాదు; ప్రభుత్వ సంస్థల అనుభవం, శాస్త్రవేత్తల మార్గదర్శకత్వం, యువ పారిశ్రామికవేత్తల సృజనాత్మకత కలిసినప్పుడు భారతదేశం ఎంతటి విజయాలను అందుకోగలదో ప్రపంచానికి చాటిచెప్పింది. హైదరాబాద్ కేంద్రంగా 2018లో స్థాపించబడిన స్కైరూట్ ఏరోస్పేస్ భారత తొలి ప్రైవేటు అంతరిక్ష ప్రయోగ సంస్థగా గుర్తింపు పొందింది. ఇస్రో మాజీ శాస్త్రవేత్తలు పవన్ కుమార్ చందన, నాగ భరత్ డాకా స్థాపించిన ఈ సంస్థ, స్వదేశీ సాంకేతికతతో చిన్న ఉపగ్రహాల ప్రయోగాలకు అనువైన రాకెట్లను అభివృద్ధి చేస్తోంది. విక్రమ్-1 విజయవంతమైన ప్రయోగంతో భారత ప్రైవేటు అంతరిక్ష రంగ సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటుతూ, అంతర్జాతీయ వాణిజ్య అంతరిక్ష సేవల్లో దేశానికి కొత్త అవకాశాల ద్వారాలు తెరిచింది. అంతరిక్ష రంగంలో ప్రైవేటు భాగస్వామ్యం వల్ల ఎన్నో సానుకూల ఫలితాలు కనిపిస్తున్నాయి. వినూత్న సాంకేతికతల అభివృద్ధి వేగవంతమవుతోంది. పరిశోధనలో కొత్త ఆలోచనలు ఆచరణలోకి వస్తున్నాయి. ఉపగ్రహాల రూపకల్పన, ప్రయోగ వాహనాల తయారీ, భూ పరిశీలన, కమ్యూనికేషన్ సేవలు వంటి విభాగాల్లో దేశీయ సంస్థలు ప్రపంచ మార్కెట్‌లో పోటీ పడే సామర్థ్యాన్ని పెంపొందించుకుంటున్నాయి. దీంతో యువ ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు, స్టార్టప్‌లకు విస్తృత అవకాశాలు లభిస్తున్నాయి. ఉపాధి సృష్టితో పాటు విదేశీ పెట్టుబడులు, వాణిజ్య ప్రయోగాల ద్వారా దేశ ఆర్థికాభివృద్ధికీ ఇది తోడ్పడుతుంది. అయితే ప్రతి అవకాశంతో పాటు కొన్ని బాధ్యతలు కూడా వస్తాయి. అంతరిక్ష రంగం అత్యంత సున్నితమైన, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ముడిపడి ఉంటుంది. కాబట్టి భద్రతా ప్రమాణాలు, నాణ్యత నియంత్రణ, పరిశోధనలో పారదర్శకత, అంతర్జాతీయ నిబంధనల పాటింపు వంటి అంశాలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రైవేటు సంస్థలు తక్షణ వాణిజ్య ప్రయోజనాలతో పాటు దేశ దీర్ఘకాల శాస్త్రీయ లక్ష్యాలను కూడా దృష్టిలో ఉంచుకుని ముందుకు సాగాలి. ప్రభుత్వం, ఇస్రో, పరిశ్రమలు, విద్యాసంస్థల మధ్య సమన్వయం మరింత బలపడితే ఈ రంగం మరింత స్థిరంగా ఎదుగుతుంది. భవిష్యత్తులో అంతరిక్ష సాంకేతికత వ్యవసాయం, వాతావరణ అంచనాలు, విపత్తు నిర్వహణ, టెలీమెడిసిన్, విద్య, రక్షణ, కమ్యూనికేషన్ వంటి అనేక రంగాలకు మరింత ఉపయోగపడనుంది. ఈ నేపథ్యంలో ప్రైవేటు భాగస్వామ్యం పరిశోధనను వేగవంతం చేయడమే కాకుండా భారతదేశాన్ని ప్రపంచ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థలో ప్రముఖ స్థానానికి చేర్చగల శక్తిని కలిగి ఉంది. భారతీయ స్టార్టప్‌లకు అంతర్జాతీయ భాగస్వామ్యాలు, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి, నూతన పెట్టుబడుల అవకాశాలు కూడా మరింత విస్తరిస్తాయి. దీని ద్వారా దేశీయ తయారీ రంగానికి ఊతమిచ్చే బలమైన అంతరిక్ష పారిశ్రామిక వ్యవస్థ ఏర్పడే అవకాశం ఉంది. విక్రమ్-1 విజయం భారత యువతలో కొత్త ఆత్మవిశ్వాసాన్ని నింపింది. ప్రభుత్వ విధానాల ప్రోత్సాహం, ఇస్రో సాంకేతిక వారసత్వం, ప్రైవేటు సంస్థల సృజనాత్మకత కలిసి పనిచేస్తే భారత అంతరిక్ష రంగం మరిన్ని శిఖరాలను అధిరోహించడం ఖాయం. ప్రపంచ అంతరిక్ష రంగంలో వేగంగా మారుతున్న పోటీ పరిస్థితుల్లో నాణ్యత, భద్రత, పరిశోధన, నవకల్పనలకు సమాన ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగితే భారతదేశం వాణిజ్య అంతరిక్ష సేవలలోనూ అగ్రగామిగా నిలిచే అవకాశాలు మరింత పెరుగుతాయి. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం పరస్పర విశ్వాసం, సాంకేతిక నైపుణ్యం, జాతీయ ప్రయోజనాల సమన్వయంతో ముందుకు సాగినప్పుడే "అంతరిక్ష శక్తిగా భారత్" అనే లక్ష్యం మరింత వేగంగా సాకారమవుతుంది.

## పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల తరహాలో రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు



**మొదటిపేజీ తరువాయి -** దుష్ప్రచారం చేస్తున్నారని, ప్రజలకు వాస్తవాలు వివరించే బాధ్యతను అధికారులు తీసుకోవాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల వల్ల కలిగే లాభాలను వివరించాలన్నారు. డాక్యుమెంట్ రైటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. డాక్యుమెంట్ రైటర్ల ఉపాధికి ఇబ్బంది లేని విధంగా మార్గాలు చూపెడతామని హామీ ఇచ్చారు. దీపం-2.0 పథక లబ్ధిదారులకు ఇచ్చే సబ్సిడీని క్రమపద్ధతిలో ఇవ్వాల్సిన అవసరం ఉందని సీఎం అన్నారు. ఈ సబ్సిడీని నిర్ధారిత తేదీల్లో ఇచ్చే అంశాన్ని పరిశీలించాలన్నారు. ఈ అంశంపై పౌర సరఫరాల శాఖ-ఆర్థిక శాఖ అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. దీనికి సంబంధించిన సాంకేతిక అంశాలను పరిశీలించి అమలు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. లిటిగెంట్ పిటిషనర్లను ఏ విధంగా కట్టడి చేయాలి, ఎలాంటి ప్రజా ప్రయోజనం లేకుండా చేసే ఫిర్యాదు దారులను గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని సీఎం చర్చించారు. రాష్ట్ర వ్యాప్తంగా 81 మంది లిటిగెంట్ పిటిషనర్లు ఉన్నట్టు గుర్తించామన్నారు. వీరు సరాసరి ఒక్కొక్కరు 246 పిటిషన్లు పెడుతున్నారన్నారు. వీరి వివరాలను జిల్లా కలెక్టర్లకు పంపించాలని సూచించారు. వారు పెట్టే అర్జీల్లో ప్రజా ప్రయోజనాలు ఉంటే వాటిని పరిశీలించాలని సూచించారు. ప్రభుత్వాన్ని, అధికారులను బద్నాం చేసే ఉద్దేశంతో పిటిషన్లు పెట్టే వారిని గుర్తించాలన్నారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఆర్థికేతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రాధాన్యతల వారీగా ఆర్థిక సమస్యలను పరిష్కరిద్దామన్నారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం కారణంగా ప్రస్తుతం 49 శాతం లోటు వర్షపాతం ఉంది. ఈ ప్రభావం నుంచి బయటపడేసే ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలన్నారు. ఈ మేరకు రైతుల్లో అవగాహన కల్పించాలని, డ్రై క్రాప్స్ వేసేలా రైతులను ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. వీబీ జీ రామ్ జీ పనులను పెద్ద ఎత్తున చేపట్టాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. జలధార పనులకు వీబీ జీ రామ్ జీ పనుల్ని అనుసంధానం చేయాలన్నారు. ప్రజాభిప్రాయాలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పని విధానం మార్చుకోవాలని, పరిపాలనా విధానాలను మెరుగుపరుచుకోవాలన్నారు. సమస్యలు ఉత్పన్నమయ్యాక చర్యలు తీసుకోవడంతోపాటు ముందుగానే ఏయే సమస్యలు వస్తాయనే విషయాన్ని అంచనా వేసి దానికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

## తల్లీ-బిడ్డ ఎక్స్‌ప్రెస్‌కు కొత్త రూపు

**మొదటిపేజీ తరువాయి -** రాష్ట్రంలో మాతా-శిశు సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం, 'తల్లీ--బిడ్డ ఎక్స్‌ప్రెస్' సేవలను మరింత మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా, గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు సురక్షితమైన, నాణ్యమైన రవాణా సౌకర్యం కల్పించేందుకు సిద్ధం చేసిన 500 నూతన వాహనాలను ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం తన క్యాంపు కార్యాలయంలో పరిశీలించారు. ఈ సందర్భంగా వాహనాల రూపకల్పన, భద్రతా ప్రమాణాలు, ప్రయాణికులకు కల్పించిన సౌకర్యాలను సీఎం క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ముఖ్యంగా తల్లీబిడ్డల అవసరాలకు అనుగుణంగా వాహనాల్లో చేసిన మార్పులను అధికారులు ఆయనకు వివరించారు. ఈ సేవలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించేలా వాహనాలపై రూపొందించిన బ్రాండింగ్ నమూనాలను పరిశీలించి, వాటికి ఆమోదం తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన బాలింతలను, వారి నవజాత శిశువులను, సహాయకులను ఉచితంగా, క్షేమంగా వారి ఇళ్లకు చేర్చడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం. దీంతో పాటు, అధిక రక్తహీనతతో బాధపడే గర్భిణులు, ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న గర్భిణులను వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రులకు తీసుకురావడానికి కూడా ఈ వాహనాలను వినియోగించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 500 వాఖ్య/వీఖ్య వాహనాల ద్వారా అందించే ఈ సేవలతో ఏటా సుమారు 2.75 లక్షల మంది బాలింతలు లబ్ధి పొందనున్నారని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ కొత్త వాహనాల్లో ప్రయాణికుల భద్రత, సౌకర్యాలకు పెద్దపీట వేశారు. వెనుక సీట్లలో సైతం సీటు బెల్టులు, బాలింతలు సులభంగా ఎక్కి దిగేందుకు వీలుగా ఫుట్‌రెస్ట్, ఎయిర్ కండిషనింగ్ (ఏసీ), ఫస్ట్ ఎయిడ్ కిట్, అగ్నిమాపక పరికరాలు వంటివి ఏర్పాటు చేశారు. ప్రతి వాహనానికి జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థను అనుసంధానించడం ద్వారా వాటి కదలికలను రియల్ టైమ్‌లో పర్యవేక్షించనున్నారు. వాహనాలపై అధికారిక స్టిక్కరింగ్ పూర్తి చేసి, త్వరలోనే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఈ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య-కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి వీరపాండ్యన్, జాతీయ ఆరోగ్య మిషన్ (డీఎవీ) అధికారులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుకే పరిమితం కాకూడదు

**మొదటిపేజీ తరువాయి -** కూటమి ప్రభుత్వం విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం అనేక చర్యలు చేపడుతోంది. ప్రతిభావంతులను ప్రోత్సహించాలనే సత్సంకల్పంతో అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా గత రెండేళ్లుగా 'షైనింగ్ స్టార్స్' పేరుతో అవార్డులను ప్రదానం చేస్తోంది. ఈ కార్యక్రమంలో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన 184 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. అలాగే ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మరో 39 మంది విద్యార్థులను గుర్తించారు. వీరందరికీ మంత్రి అనిత చేతుల మీదుగా అవార్డులను అందజేశారు. ప్రతి విద్యార్థికి ఒక మెడల్, మెరిట్ సర్టిఫికెట్ ఇచ్చారు. వీటితో పాటు ప్రోత్సాహకంగా రూ.20 వేల నగదును బహుకరించారు. ఈ సందర్భంగా మంత్రి వంగలపూడి అనిత విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. విజయనగరం అంటేనే విజ్ఞాన నగరమని ఆమె కీర్తించారు. ఈ గడ్డ ఎన్నో అద్భుత చరిత్రలను సృష్టించిందని గుర్తుచేశారు. విద్యార్థులు ఇక్కడి నుంచి స్ఫూర్తి పొందాలన్నారు. ప్రతి ఒక్కరూ భవిష్యత్తుపై ఒక నిర్దిష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని సూచించారు. సమయాన్ని ఏమాత్రం వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. విలువలతో కూడిన విద్యను అభ్యసించడం ఎంతో అవసరమని చెప్పారు. విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకూడదన్నారు. చదువుతో పాటు మంచి సంస్కారం కూడా అలవర్చుకోవాలని హితవు పలికారు. తల్లిదండ్రుల కష్టాన్ని పిల్లలు ఎప్పటికీ మర్చిపోకూడదని మంత్రి కోరారు. ఎన్నో త్యాగాలు చేసి వారు తమ పిల్లలను చదివిస్తున్నారని గుర్తుచేశారు. వారి కష్టాన్ని వృథా చేయకుండా చూసుకోవాల్సిన బాధ్యత విద్యార్థులదే అన్నారు. కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అప్పుడే తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు వస్తుందన్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నిర్ణయాలను ఆమె కొనియాడారు. విద్యారంగంలో ఆయన ఎన్నో మార్పులు తీసుకువస్తున్నారని చెప్పారు. విద్యార్థుల కోసం ప్రభుత్వ పాఠశాలల్లో సకల వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి పైనా మంత్రి అనిత కీలక వ్యాఖ్యలు చేశారు. రాబోయే రోజుల్లో ఉత్తరాంధ్రలో భారీగా పరిశ్రమలు రాబోతున్నాయని వెల్లడించారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఈ ప్రాంత సమగ్రాభివృద్ధికి ఎంతో దోహదం చేస్తాయన్నారు. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో పలువురు ప్రము ఖులు పాల్గొన్నారు. విజయనగరం జిల్లా కలెక్టర్ రాంసుందర్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యేలు అదితి విజయలక్ష్మి గజపతిరాజు, లోకం మాధవి హాజరయ్యారు. వీరితో పాటు మార్క్‌ఫెడ్ ఛైర్మన్ బంగారు రాజు, డీసీఎంఎస్ ఛైర్మన్ గొంప కృష్ణ, తూర్పు కాపు అభివృద్ధి సంక్షేమ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పాలవలస యశస్వి తదితరులు పాల్గొన్నారు. "విజయనగరం అంటేనే ఒక విజ్ఞాన నగరం. ఈ గడ్డ ఎన్నో చరిత్రలు సృష్టించిన గడ్డ. నేటి విద్యార్థులు ఇక్కడి నుంచి ఎంతో స్ఫూర్తి పొందాలి. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యారంగంలో ఎన్నో అద్భుతమైన మార్పులు తీసుకువస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నాం. ఉత్తరాంధ్రలో పెద్ద సంఖ్యలో పరిశ్రమలు కూడా రాబోతున్నాయి. విద్యార్థులు తమ సమయాన్ని వృథా చేసుకోకుండా సద్వినియోగం చేసుకోవాలి.

## డెంగీపై భారత్‌కు తొలి వ్యాక్సిన్

**మొదటిపేజీ తరువాయి -** వ్యాక్సిన్‌గా జపాన్‌కు చెందిన టకెడా కంపెనీ రూపొందించిన 'క్యూడెంగా'కు 'కేంద్ర ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ (సీడీఎస్‌సీఓ) ఆమోదం తెలిపింది. దీంతో డెంగీ నివారణలో భారత్‌కు మరో కీలక ఆయుధం అందుబాటులోకి రానుంది. భారత్‌లో గత రెండు దశాబ్దాలుగా డెంగీ కేసులు వేగంగా పెరుగు తున్నాయి. పట్టణీకరణ, వాతావరణ మార్పులు, దోమల వ్యాప్తికి అనుకూల పరిస్థితులు, జనాభా పెరుగుదల ఇందుకు ప్రధాన కారణాలుగా నిపుణులు చెబుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా నమోదవుతున్న డెంగీ కేసుల్లో దాదాపు మూడో వంతు భారత్‌లోనే ఉంటాయని అంచనా. ముఖ్యంగా వర్షాకాలం, ఆ తర్వాతి నెలల్లో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులపై తీవ్ర ఒత్తిడి పడుతోంది. క్యూడెంగా (టీఏకే-003)ను జపాన్‌కు చెందిన ఔషధ సంస్థ టకెడా అభివృద్ధి చేసింది. ఇది లైవ్ అటెన్యుయేటెడ్ టెట్రావాలెంట్ వ్యాక్సిన్. అంటే డెంగీ వైరస్‌లోని నాలుగు రకాలైన డెన్‌వీ-1, డెన్‌వీ-2, డెన్‌వీ-3, డెన్‌వీ-4పై రోగనిరోధక శక్తిని పెంచేలా రూపొందించారు. ఈ వ్యాక్సిన్‌ను మూడు నెలల వ్యవధిలో రెండు డోసులుగా ఇస్తారు. చర్మం కింద ఇంజెక్షన్ రూపంలో వేస్తారు. డెంగీ అధికంగా ఉన్న దేశాల్లో సమగ్ర నియంత్రణ వ్యూహంలో భాగంగా దీన్ని వినియోగించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ఇప్పటికే సూచించింది. ఈ వ్యాక్సిన్‌కు మరో ప్రత్యేకత కూడా ఉంది. గతంలో అందుబాటులో ఉన్న డెంగ్‌వాక్సియా వ్యాక్సిన్ తీసుకునే ముందు వ్యక్తికి ఇప్పటికే డెంగీ సోకిందో లేదో రక్త పరీక్ష చేయాల్సి వచ్చేది. అలాంటి అవసరం క్యూడెంగాకు లేదు. డెంగీ వచ్చినా, రాకపోయినా ఈ వ్యాక్సిన్ ఇవ్వొచ్చు. దీంతో సామూహిక టీకా కార్యక్రమాలను సులభంగా నిర్వహించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం యూరోపియన్ యూనియన్, బ్రిటన్, బ్రెజిల్, ఇండోనేషియా, అర్జెంటీనా సహా 40కిపైగా దేశాల్లో ఈ వ్యాక్సిన్‌కు అనుమతులు లభించాయి. ఇప్పుడు ఆ జాబితాలో భారత్ కూడా చేరింది. క్యూడెంగా ప్రభావంపై నిర్వహించిన టైడ్స్ ఫేజ్-3 క్లినికల్ అధ్యయనంలో 20 వేల మందికిపైగా పిల్లలు, యువత పాల్గొన్నారు. సుమారు నాలుగున్నరేళ్ల పరిశీలనలో ఆసుపత్రిలో చేరే పరిస్థితిని 84 శాతం వరకు తగ్గించినట్లు గుర్తించారు. ప్రయోగశాల పరీక్షల్లో నిర్ధారిత డెంగీ కేసులపై దాదాపు 61 శాతం రక్షణ కల్పించినట్లు వెల్లడైంది. గతంలో సోకిన వారికైనా, సోకని వారికైనా తీవ్రమైన డెంగీ ప్రమాదాన్ని తగ్గించడంలో మంచి ఫలితాలు కనిపించాయి. వైరస్ రకాన్ని బట్టి ప్రభావంలో కొంత తేడా ఉన్నప్పటికీ మొత్తం ఫలితాలు ఆశాజనకంగా ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. భారత్‌లో ఈ వ్యాక్సిన్ ధరను ఇంకా ప్రకటించలేదు. అయితే హైదరాబాద్‌కు చెందిన 'బయోలాజికల్-ఈ'తో టకెడా ఇప్పటికే ఉత్పత్తి ఒప్పందం కుదుర్చుకుంది. ఏడాదికి ఐదు కోట్ల డోసులు తయారు చేసే సామర్థ్యాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. దేశీయంగా తయారీ ప్రారంభమైతే ధరలు తగ్గే అవకాశముందని భావిస్తున్నారు. మొదట ప్రైవేటు ఆసుపత్రుల్లో అందుబాటులోకి వస్తుందా, లేక ప్రభుత్వ టీకా కార్యక్రమంలో చేర్చుతారా అన్న విషయంపై త్వరలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## రాహుల్ వయసుపై ప్రధాని మోదీ చురకలు

**మొదటిపేజీ తరువాయి -** మాట్లాడటం లేదు... రోదసిలో త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించిన 28 ఏళ్ల యువత గురించి మాట్లాడుతున్నాను" అని మోదీ పేర్కొన్నారు. జూన్ మాసంలో 56వ ఏట అడుగుపెట్టిన రాహుల్ గాంధీని ఉద్దేశించే ప్రధాని ఈ వ్యాఖ్యలు చేసినట్లు స్పష్టమవుతోంది. హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ శనివారం 'విక్రమ్-1' రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించిన సంగతి తెలిసిందే. ఈ ప్రయోగం ద్వారా అమెరికా, చైనాల తర్వాత ప్రైవేట్ ఆర్బిటల్ ప్రయోగ సామర్థ్యాలను కలిగిన మూడో దేశంగా భారత్ రికార్డు సృష్టించింది. ప్రపంచవ్యాప్తంగా కేవలం కొన్ని దేశాలకు మాత్రమే పరిమితమైన ఈ ఘనతను భారత యువత సాధించడం దేశానికే గర్వకారణమని మోదీ కొనియాడారు. గత ఏడాది వర్షాకాల సమావేశాల కంటే ముందు ఓ భారత పౌరుడు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్న అంశాన్ని కూడా ప్రధాని ఈ సందర్భంగా గుర్తుచేశారు. పార్లమెంట్ సమావేశాలు అర్థవంతంగా, ఫలప్రదంగా సాగాలని, ప్రజా సమస్యలపై లోతైన చర్చలు జరగాలని ఆయన ఆకాంక్షించారు.

## కేంద్రమంత్రి జేపీ నడ్డాతో కాక్రోచ్ జనతా పార్టీ నాయకుల భేటీ

**మొదటిపేజీ తరువాయి -** 'పార్లమెంట్ ముట్టడి'కి పిలుపునివ్వడంతో జంతర్ మంతర్ వద్దకు విద్యార్థులు, యువత భారీగా చేరుకున్నారు. అక్కడి నుంచి పార్లమెంట్ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన నిరసనకారులను పోలీసులు అడ్డుకున్నారు. నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నప్పటికీ ముందుకు వెళ్లేందుకు యత్నించిన ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు కొన్నిచోట్ల లాఠీఛార్జ్ చేయడంతో పాటు బాష్పవాయువును ప్రయోగించారు. సోషల్ మీడియాలో ఒక వ్యంగ్య ఉద్యమంగా ఆరంభమైన కాక్రోచ్ జనతా పార్టీ, ప్రస్తుతం పరీక్షల లీకేజీలు, సాంకేతిక వైఫల్యాలపై నిరంతరాయంగా పోరాడుతోంది. ఈ ఉద్యమానికి మద్దతుగా పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ సుదీర్ఘ నిరాహార దీక్ష చేపట్టారు. ఆందోళనలు ప్రారంభమైన తర్వాత సీజేపీ నేతలతో కేంద్ర ప్రభుత్వం ఉన్నత స్థాయిలో చర్చలు జరపడం ఇదే ప్రథమం. తమ డిమాండ్లు నెరవేరే వరకు శాంతియుత నిరసనలు కొనసాగిస్తామని సీజేపీ నాయకత్వం తేల్చిచెప్పింది.

## పాకిస్థాన్‌ను చుట్టుముట్టిన ఆర్థిక సంక్షోభం

**మొదటిపేజీ తరువాయి -** జనాభాలో దాదాపు 29 శాతం మంది పేదరిక రేఖకు దిగువన జీవిస్తున్నారని ఒక తాజా నివేదిక వెల్లడించింది. 2018-19లో 21.8 శాతంగా ఉన్న పేదరికం, 2024-25 నాటికి 28.9 శాతానికి చేరింది. అంటే కేవలం ఆరేళ్లలోనే పేదరికం 7 శాతం పెరిగింది. హౌస్‌హోల్డ్ ఇంటిగ్రేటెడ్ ఎకనామిక్ సర్వే (హెచ్‌ఐఈఎస్), పాకిస్థాన్ సోషల్ అండ్ లివింగ్ స్టాండర్డ్స్ మెజర్‌మెంట్ (పీఎస్ఎల్ఎం) డేటా ఆధారంగా 'డాన్' పత్రిక ఈ విశ్లేషణను ప్రచురించింది. దాదాపు ఆరేళ్ల విరామం తర్వాత విడుదలైన ఈ గణాంకాలు.. దేశం ఎదుర్కొన్న బహుళ సంక్షోభాల ప్రభావాన్ని స్పష్టం చేస్తున్నాయి. పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాలపై ఈ ప్రభావం మరింత తీవ్రంగా ఉంది. గ్రామీణ పాకిస్థాన్‌లో పేదరికం సుమారు 8 శాతం మేర పెరగగా, పట్టణ ప్రాంతాల్లో ఇది 6 శాతంగా నమోదైంది. పదేపదే తలెత్తిన చెల్లింపుల సంక్షోభం, కోవిడ్-19 మహమ్మారి, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, దీర్ఘకాలిక స్థూల ఆర్థిక సర్దుబాట్లు వంటివి ఈ దుస్థితికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. విశ్లేషకులు ఈ పరిస్థితిని జీవన ప్రమాణాల మెరుగుదల విషయంలో 'కోల్పోయిన దశాబ్దం'గా అభివర్ణిస్తున్నారు. గత రెండు సర్వేల మధ్య కాలంలో ద్రవ్యోల్బణాన్ని సర్దుబాటు చేసిన తర్వాత చూస్తే, సగటు కుటుంబ ఆదాయాలు, వినియోగం గణనీయంగా తగ్గినట్లు నివేదిక పేర్కొంది. ఆర్థిక వృద్ధి సానుకూలంగా ఉన్నప్పటికీ, పేదరికం పెరగడం ఆందోళన కలిగించే అంశం. ఈ వృద్ధి ఫలాలు ఎక్కువగా ఉన్నత ఆదాయ వర్గాలకే చేరాయని, దిగువ ఆదాయ వర్గాల వాస్తవ ఆదాయాలు, కొనుగోలు శక్తి తీవ్రంగా దెబ్బతిన్నాయని ఇది సూచిస్తోంది. పేద కుటుంబాలు ఎక్కువగా రోజువారీ వేతనాలపై ఆధారపడతాయి. అధిక ద్రవ్యోల్బణం, ఆర్థిక అంతరాయాల వల్ల ఈ వర్గాలే ఎక్కువగా నష్టపోయాయి. మరోవైపు, సంపన్న వర్గాలు రియల్ ఎస్టేట్, ఆర్థిక పెట్టుబడుల వంటి ఆస్తులను కలిగి ఉండటంతో, ధరల పెరుగుదల ప్రభావాన్ని తట్టుకోగలిగారు. దీంతో దేశంలో ఆదాయ అసమానతలు మరింత పెరిగాయి. ప్రస్తుత భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, బాహ్య ఆర్థికపరమైన రిస్కుల మధ్య, పెరుగుతున్న పేదరికాన్ని, విస్తరిస్తున్న అసమానతలను పరిష్కరిస్తూనే ఆర్థిక వృద్ధిని కొనసాగించడం పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థకు పెను సవాలుగా మారింది.

## కేంద్రంపై సీఎం రేవంత్ రెడ్డి ఫైర్

**మొదటిపేజీ తరువాయి -** ఎల్లప్పుడూ అండగా ఉంటాను" అని తన పోస్ట్‌లో పేర్కొన్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలిరోజైన సోమవారం, కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో విద్యార్థులు 'ఛలో పార్లమెంట్' కార్యక్రమాన్ని చేపట్టారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)లో సమూల సంస్కరణలు తీసుకురావాలని డిమాండ్ చేస్తూ వారు పార్లమెంట్ వైపు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే, అనుమతి లేదంటూ పోలీసులు వారిని అడ్డుకోవడంతో అక్కడ ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీఛార్జ్ చేయడంతో పాటు టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఈ ఘటనలో పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి.

## తెలంగాణలో క్యూఆర్ కోడ్‌తో కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు

**మొదటిపేజీ తరువాయి -** స్మార్ట్ కార్డులను పంపిణీ చేయనుంది. వారం రోజుల్లోనే ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి ప్రారంభించేందుకు పౌరసరఫరాల శాఖ ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. హైదరాబాద్‌లో జరిగే ప్రధాన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పీవీసీ స్మార్ట్ కార్డుల రూపంలో రేషన్ కార్డులు ఇవ్వడం ఇదే తొలిసారి. ప్రస్తుతం లబ్ధిదారులు వాడుతున్న ఏ4 సైజు కాగితపు కార్డులు త్వరగా చిరిగిపోవడం, పాడైపోతుండటంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కొత్తగా అందించే స్మార్ట్ కార్డులపై లబ్ధిదారుడి వివరాలతో పాటు ప్రత్యేకమైన క్యూఆర్ కోడ్, ఆహార భద్రతా కార్డు నంబర్‌ను ముద్రించారు. భద్రతా ఫీచర్లతో పాటు సీఎం రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటోలు కూడా ఉంటాయి. ఈ స్మార్ట్ కార్డుల ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థలో మరింత పారదర్శకత వస్తుందని అధికారులు విశ్వసిస్తున్నారు. రాజధానిలో సీఎం కార్యక్రమాన్ని ప్రారంభిస్తుండగా, అదే సమయంలో రాష్ట్రంలోని మొత్తం 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల చేతుల మీదుగా లబ్ధిదారులకు కొత్త కార్డులు అందజేయనున్నారు. ఈ బృహత్తర కార్యక్రమం కోసం పౌరసరఫరాల శాఖ సమగ్ర ప్రణాళికను రూపొందించింది.

### ఒకేసారి మూడు నెలల బియ్యం

ఇదిలాఉంటే.. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పేదలకు ఇబ్బంది కలగకుండా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయనుంది. ఆగస్టు 1 నుంచి నెల రోజుల పాటు రేషన్ దుకాణాలు తెరిచి ఉంటాయి. లబ్ధిదారులు మూడుసార్లు వేలిముద్రలు వేసి తమ కోటాను పొందవచ్చు. అయితే, ఈసారి రేషన్ సరుకులు పొందాలంటే ఈ-కేవైసీ తప్పనిసరి అని అధికారులు స్పష్టం చేశారు. ఈ-కేవైసీ పూర్తి చేసుకునేందుకు జులై 31ని ఆఖరి తేదీగా నిర్ణయించారు. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు కూడా తమకు దగ్గరలోని రేషన్ దుకాణంలో ఈ-కేవైసీ పూర్తి చేసుకోవచ్చని అధికారులు సూచించారు. గడువులోగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోని వారికి రేషన్ సరుకులు అందవని స్పష్టం చేశారు.

## ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా ఉంది



**మొదటిపేజీ తరువాయి -** ఎదుర్కోవాల్సిన చర్యలపై నల్గొండ కలెక్టరేట్‌లో సూర్యాపేట, నల్గొండ, యాదాద్రి భువనగిరి జిల్లాలకు చెందిన అధికారులతో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌లు సమీక్ష నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా ఉందని వివరించారు. రైతులు వరి పంట వేస్తే ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని, ఈ విషయంపై అన్నదాతలకు అవగాహన కల్పించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో నీళ్లు లేవని వర్షాలు కూడా తక్కువేనని మంత్రులు తెలిపారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు అన్నదాతలు మొగ్గు చూపాలని సూచించారు. తక్కువ నీరు అవసరమయ్యే ఆరుతడి పంటలు వేసుకోవాలని దీనిపై రైతులకు దిశానిర్దేశం చేయాలని అధికారులకు సూచించారు. ఎల్‌నినో పరిస్థితులకు తగ్గట్టుగా ఉమ్మడి నల్గొండ జిల్లా సిద్ధం కావాలన్నారు. "ఇప్పుడున్న పరిస్థితుల్లో వరి పండించేందుకు తగినంత నీళ్లు లేవు. భవిష్యత్‌లో వర్షాలు పడతాయనే నమ్మి రైతులు వరి పంట వేసినట్లయితే ఇబ్బందులు ఎదరయ్యే అవకాశం ఉంది. ఇవాళ్టి వరకు ఉన్న పరిస్థితుల ప్రకారం, పడ్డ వర్షాలు, రిజర్వాయర్లలో నీటి మట్టాలు పరిశీలించినట్లయితే వరి పండించడం చాలా కష్టసాధ్యమనే విషయాన్ని మూడు జిల్లాలకు చెందిన అధికారులు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి. దీని తీవ్రతను రైతులకు వివరించాలన్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇటీవల జరిగిన కేబినెట్ భేటీ ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సీఎం రేవంత్ రెడ్డి మంత్రులతో సమీక్షించారు. ఎల్‌నినో ప్రభావంపై కేంద్రానికి నివేదిక ఇవ్వాలని కూడా నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు జిల్లా కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు ఇటీవల సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలపై ఆయన అధికారులకు ఇప్పటికే దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ప్రత్యామ్నాయ పంటలవైపు రైతులను మల్లించే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన సూచించిన విషయం తెలిసిందే. ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా ఆరు తడి పంటలు వేయాలని నిపుణులు సూచిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వరి, పత్తి వైపు వెళ్లకుండా సజ్జ, జొన్న, రాగి, వరిగలు, కంది, పెసర, మినుము, వేరుశనగ వంటి వాటితో పాటు ఆవాలు, టమాట, సోర, వంగ, బీర, దోస, కాకర వంటి కూరగాయలు సాగు చేసుకోవాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ఆరుతడి పంటలు వేయాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నా రైతుల్లో స్పందన లేదు. వరి సాగుచేసిన భూముల్లో ముఖ్యంగా నల్లరేగడి నేలలో ఇతర పంటల సాగుకు యోగ్యంకాదని రైతులు చెబుతున్నారు. సన్నరకాల వరి పండించేందుకు కర్షకులు మొగ్గు చూపుతున్నారు. వరి తర్వాత అధికంగా పత్తిని రైతులు సాగుచేసేవారు. రెండు లక్షల సాధారణ సాగు విస్తీర్ణానికి ప్రస్తుతం లక్షఎకరాల్లో వేశారు. భవిష్యత్‌లో వర్షాభావ పరిస్థితులు తీవ్రమైతే రైతులు నష్టపోయే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

# బైక్‌ను ఎన్ని కి.మీ తర్వాత సర్వీస్ చేయాలి? సరైన సమయం ఏది?



మీరు బైక్ సర్వీసింగ్ కోసం వెళ్ళినప్పుడల్లా సర్వీసింగ్ సమయంలో ఆయిల్ ఫిల్టర్, ఇంజిన్ ఆయిల్ మారుస్తారు. ఎయిర్ ఫిల్టర్ కూడా మారుస్తారు. ఆయిల్ వేయడమే కాకుండా చైన్ కూడా తనిఖీ చేస్తారు. ఎలక్ట్రికల్ సిస్టమ్, వైరింగ్ కూడా తనిఖీ.. బైక్ నడుపుతున్నప్పుడు మీరు చాలా విషయాలను గుర్తుంచుకోవాలి. మీరు బైక్ నడుపుతుంటే మీ బైక్‌ను ఎప్పుడు సర్వీస్ చేయించుకోవాలో మీరు తెలుసుకోవాలి. దీనికి సరైన సమాధానం మీకు తెలియకపోతే ఇప్పుడు తెలుసుకుందాం. సర్వీసింగ్‌లో ఆలస్యం చేస్తే ఎలాంటి సమస్యలు వస్తాయో కూడా తెలుసుకుందాం.

**బైక్ సర్వీసింగ్ కి ఇది సరైన సమయమా?**

ప్రతి 2000 కి.మీ. కి బైక్ సర్వీస్ చేయాలి. సకాలంలో సర్వీస్ చేస్తే బైక్ పనితీరు, ఇంజిన్ లైఫ్, మైలేజ్ అన్నీ బాగా, బలంగా ఉంటాయి. కొత్త బైక్ మొదటి సర్వీస్ 500-750 కి.మీ. వద్ద చేయాలి. అలాగే ఏదైనా కారణం చేత మీరు 2000 కి.మీలకు సర్వీస్ చేయలేకపోతే ఖచ్చితంగా 2500 కిలోమీటర్ల వద్ద చేయండి. కానీ 2500 కి.మీ. కంటే తరువాత సర్వీస్ చేయవద్దు. మీరు ఇలా చేస్తే క్లచ్ ప్లేట్, పిస్టన్, బైక్ చైన్ కూడా దెబ్బతింటుంది.

**ఆలస్యంగా సర్వీసింగ్ చేయడం వల్ల కలిగే నష్టాలు ఇవే:**

మీరు బైక్‌ను సకాలంలో సర్వీస్ చేయకపోతే పిస్టన్ దెబ్బతిన్నట్లయితే. దానిని మరమ్మతు చేయడానికి మీకు దాదాపు 3 వేల రూపాయలు, క్లచ్-పిస్టన్ మరమ్మతు చేయడానికి 4500 రూపాయల వరకు ఖర్చవుతుంది. ఇంజిన్ దెబ్బతిన్నట్లయితే మీరు 6 నుండి 7 వేల రూపాయల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది.

**సర్వీసింగ్‌లో ఏమి జరుగుతుంది?**

మీరు బైక్ సర్వీసింగ్ కోసం వెళ్ళినప్పుడల్లా సర్వీసింగ్ సమయంలో ఆయిల్ ఫిల్టర్, ఇంజిన్ ఆయిల్ మారుస్తారు. ఎయిర్ ఫిల్టర్ కూడా మారుస్తారు. ఆయిల్ వేయడమే కాకుండా చైన్ కూడా తనిఖీ చేస్తారు. ఎలక్ట్రికల్ సిస్టమ్, వైరింగ్ కూడా తనిఖీ చేస్తారు. మీ బైక్ ఇంజిన్ చాలా శబ్దం చేస్తుంటే మీరు దానిని సర్వీస్ చేయించుకోవచ్చు. లేదా మైలేజ్ తక్కువగా ఉంటే, అలాగే బైక్ నుండి పొగ వస్తుంటే మీరు వెంటనే బైక్‌ను సర్వీస్ చేయించుకోవాలి.

# విద్యార్థులకు ఉచిత రక్త వర్గం పరీక్షలు



**ప్యాపిలి, జూలై 20 (సీమ కిరణం న్యూస్) :** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం యన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థుల ఆరోగ్య అవగాహనను పెంపొందించే ఉద్దేశంతో ఉచిత రక్త వర్గం (బ్లడ్ గ్రూప్) పరీక్షల కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి తన రక్త వర్గం గురించి తెలుసుకోవడం ఎంతో అవసరమన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రక్త వర్గం తెలియకపోతే ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ పరీక్షల ద్వారా విద్యార్థులు తమ రక్త వర్గాన్ని తెలుసుకోవడమే కాకుండా, భవిష్యత్తులో రక్తదానానికి సిద్ధంగా ఉండే అవకాశాన్ని పొందుతారని తెలిపారు. రక్తదానం అనేది ప్రాణాలను కాపాడే మహోన్నత సేవ అని, అవసరమైన సమయంలో ఇతరులకు రక్తం అందించాలన్నా, లేదా మనకు రక్తం అవసరమైనా మన రక్త వర్గం గురించి ఖచ్చితమైన అవగాహన ఉండాలని ఆయన సూచించారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా రక్త వర్గం పరీక్ష చేయించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర ల్యాబ్ టెక్నీషియన్లు కమల్, నాగసాయి విద్యార్థులకు రక్త వర్గ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ నవీన పాటి, అధ్యాపకులు అనంతలక్ష్మి, ముస్తాక్, వెంకటరమణ, ఓబులేసు, మద్దిలేటి, వెంకటేశ్వర్లు, మురళీమోహన్, శంకరయ్య, సురేష్, మంజునాథ్, వన్నూర్తో పాటు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ రక్త వర్గాలను పరీక్షించించుకున్నారు.

## మరణించిన కుటుంబ సభ్యులను పరామర్శించిన బుగ్గన







**డోన్ టౌన్, జూలై 20,(సీమ కిరణం న్యూస్):** మాజీ మంత్రివర్యులు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి డోన్ మండలం ధర్మవరం గ్రామంలో ఇటీవల మరణించిన ఎల్లమ్మ,హనుమంతు,పుల్లమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు.వారితో పాటు రాష్ట్ర మాజీ మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు ,ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి ,మండల అధ్యక్షుడు సోమేశ్ యాదవ్ , గజేంద్రనాథ్ రెడ్డి గారు,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రామచంద్రుడు ,మాజీ సింగిల్ విండో చైర్మన్ తిరుమల్ రెడ్డి , సీనియర్ న్యాయవాది విశ్వనాథ్ రెడ్డి ,తిమ్మారెడ్డి గారు,గొల్ల శ్రీను,బోయ శ్రీరాములు,రమేష్ రెడ్డి, మహేశ్వర రెడ్డి,పరశురామ,మల్లి,రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు

# భార్య హత్య కేసులో భర్త అరెస్ట్



**డోన్ టౌన్, జూలై 20,(సీమ కిరణం న్యూస్):** డోన్ పట్టణంలో ఈ నెల 18న జరిగిన బలిజ ఈశ్వరి (35) హత్య కేసులో ఆమె భర్త షేక్ ఇంతియాజ్ భాష (38)ను డోన్ టౌన్ పోలీసులు అరెస్ట్ చేసినారు. డోన్ టౌన్ సీఐ తెలిపిన వివరాలు ప్రకారము . ఆయన ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో భాగంగా హత్యకు ఉపయోగించిన ఇనుప రాడ్డును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోందని సీఐ తెలిపారు.

# భారత రైల్వే కీలక నిర్ణయం.. ఇప్పుడు రైళ్లలో కూడా బ్లాక్ బాక్స్ ఏర్పాటు!



భారత రైల్వే ప్రయాణికుల కోసం కొత్త కొత్త సదుపాయాలను అందుబాటులోకి తీసుకువస్తోంది. ఈ మధ్య కాలంలో రైలు ప్రమాదాలు కూడా పెరిగిపోతున్నాయి. ప్రమాదాలను అరికట్టేందుకు రైల్వే చర్యలు చేపడుతూనే ఉంది. ఇప్పుడు రైళ్లలో బ్లాక్ బాక్స్‌ను ఏర్పాటు చేయనుంది. ఇది సాధారణంగా విమానాల్లో మాత్రమే ఉంటుంది. కానీ ఇప్పుడు రైళ్లలో ఏర్పాటు చేసేందుకు.. బ్లాక్ బాక్స్.. దీని చాలా సార్లు వినే ఉంటారు. దీనిని విమానాలలో ఏర్పాటు చేస్తారు. బ్లాక్ బాక్స్‌లో పైలట్ మాట్లాడిన మాటలు పూర్తిగా రికార్డు అవుతాయి. దీని వల్ల ప్రమాదం జరిగేందుకు కారణాలను తెలుసుకోవచ్చు. విమానాల మాదిరిగానే ఇప్పుడు ప్రతి రైలులోనూ బ్లాక్ బాక్స్ ఏర్పాటు చేయనుంది రైల్వే. ఈ బ్లాక్ బాక్స్ రైలు ఇంజిన్‌లో అమర్చుతారు. లోకో పైలట్ ప్రతి కార్యాచరణ దానిలో రికార్డ్ అవుతుంది. సంభాషణ ఆడియో-వీడియో రికార్డింగ్ ఉంటుంది. ప్రస్తుతం వందే భారత్ రైళ్లలో బ్లాక్ బాక్స్ ఏర్పాటు చేశారు. కొత్త రైళ్ల ఇంజిన్లలో బ్లాక్ బాక్స్ ఏర్పాటు చేయడానికి టెండర్లు కూడా జారీ చేశారు. అంటే బనారస్ లోకో వర్క్స్ ఈ టెండర్లను జారీ చేసింది. ప్రతిరోజూ లక్షలాది మంది ప్రయాణికులను ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి రవాణా చేయడానికి రైల్వేల భారీ నెట్‌వర్క్ పనిచేస్తుంది. అటువంటి పరిస్థితిలో ప్రమాదాలకు కారణాన్ని కనుగొనడంలో, వాటిని నివారించడంలో బ్లాక్ బాక్స్ వంటి సాంకేతికత చాలా సహాయపడుతుంది. హై స్పీడ్ రైళ్ల ఆపరేషన్ కారణంగా దీని అవసరం మరింతగా అనుభూతి చెందుతోంది. రైలు ప్రమాదాలను నివారించడానికి రైల్వేలు ఈ చర్య తీసుకోబోతున్నాయి. విమానాల మాదిరిగానే సుదూర రైళ్ల ఇంజిన్లలో 'బ్లాక్ బాక్స్ ' ఏర్పాటు చేయనున్నారు. లోకో పైలట్ క్యాబిన్, స్థానిక రైళ్ల మోటార్‌మ్యాన్ క్యాబిన్‌లను క్రూ వాయిస్ అండ్ వీడియో రికార్డింగ్ సిస్టమ్‌తో అమర్చనున్నారు. దీనితో పాటు బోగీ వెలుపల ఆడియో విజువల్ టెక్నాలజీని ఏర్పాటు చేస్తారు . లోకో పైలట్ క్యాబిన్‌లో కెమెరాలు ఏర్పాటు చేస్తారు. ఈ కెమెరాల ద్వారా లోకో పైలట్, అసిస్టెంట్ లోకో పైలట్ పర్యవేక్షిస్తారు. ఇవన్నీ వ్యవస్థలో నమోదు అవుతాయి. అలాగే విమాన ప్రమాదంలో బ్లాక్ బాక్స్ సహాయపడినట్లే ఈ వ్యవస్థ ఏదైనా ప్రమాదం లేదా అత్యవసర పరిస్థితిలో రైల్వేలకు సహాయపడుతుంది. ఈ సాంకేతికత సహాయంతో రైలు ప్రమాదం జరిగినప్పుడు అసలు కారణాన్ని కనుగొనవచ్చు.

# క్రాప్ ఇన్సూరెన్స్ గడువు ఆగస్టు 15 వరకు పొడిగించాలి : సీపీఐ ఏపీ రైతు సంఘం



## ప్రభుత్వ భూముల డి-పట్టా రైతులకు కూడా క్రాప్ ఇన్సూరెన్స్ వర్తింప చేయాలని డిమాండ్

**వెల్దుర్తి, జూలై 20 (సీమకిరణం న్యూస్):** ఖరీఫ్-2026 సీజన్‌కు సంబంధించి క్రాప్ ఇన్సూరెన్స్ గడువును ఆగస్టు 15 వరకు పొడిగించాలని, ప్రభుత్వ భూములపై డి-పట్టాలతో సాగు చేస్తున్న రైతులకు కూడా క్రాప్ ఇన్సూరెన్స్ వర్తింప చేయాలని సీపీఐ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం వెల్దుర్తి ఎమ్మార్వో కార్యాలయంలో ఎమ్మార్వో చంద్రశేఖర్ వర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ వెల్దుర్తి మండల కార్యదర్శి టీ. కృష్ణ, రైతు సంఘం మండల నాయకుడు డి. రాజు, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి చిన్నమాదులు మాట్లాడుతూ, ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరి, ఉల్లి, వేరుశనగ, పత్తి, మిరప, మొక్కజొన్న, కంది, టమోటా, సజ్జ, కొర్ర, జొన్న, రాగి తదితర పంటలను రైతులు విస్తృతంగా సాగు చేశారని తెలిపారు. ప్రస్తుతం వర్షాలు కురవకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని, నష్టపోయిన రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. జూలై 15తోనే వేరుశనగ, పత్తి పంటల ఇన్సూరెన్స్ గడువు ముగించడం అన్యాయమని, దానిని ఆగస్టు 15 వరకు పొడిగించాలని డిమాండ్ చేశారు. అలాగే టమోటా పంటను కూడా క్రాప్ ఇన్సూరెన్స్ పరిధిలోకి తీసుకురావాలని, పంట రుణాలు తీసుకున్న రైతుల తరఫున బ్యాంకులే ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. క్రాప్ ఇన్సూరెన్స్ పేరుతో రైతులను దోపిడీ చేస్తున్న మీ సేవ, సీఎస్సీ కేంద్రాలపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. వర్షాభావం కారణంగా పంటలు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం స్వయంగా ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించడంతో పాటు, ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు శివ, పాముప్ప, రంగముని, చంద్రప్ప, గురుపాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# త్వరలోనే పతంజలి ఆయుర్వేద ఆస్పత్రిలో చికిత్స ప్రారంభం!

# ఎయిమ్స్, టాటా క్యాన్సర్ సహకారంతో..




పతంజలి విశ్వవిద్యాలయం, పతంజలి పరిశోధనా సంస్థ, న్యూఢిల్లీ సెంట్రల్ సంస్కృత విశ్వవిద్యాలయం సంయుక్తంగా ఆయుర్వేదం, ఆధునిక వైద్యాల సమన్వయాన్ని లక్ష్యంగా చేసుకుని గ్రాండ్ అనమయ అంతర్జాతీయ సమావేశం నిర్వహించాయి. 300 మందికి పైగా నిపుణులు పాల్గొని, ఆధారాల ఆధారిత వైద్యం, సమగ్ర వైద్యంపై చర్చించారు. పతంజలి విశ్వవిద్యాలయం, పతంజలి పరిశోధనా సంస్థ, న్యూఢిల్లీలోని సెంట్రల్ సంస్కృత విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల గ్రాండ్ అనమయ అంతర్జాతీయ సమావేశం నిర్వహించాయి. ఆయుర్వేదం, ఆధునిక వైద్యం ఏకీకరణ, సమన్వయం లక్ష్యంతో ప్రపంచ వేదికను అందించడానికి ఈ సమావేశం నిర్వహించారు. 16 రాష్ట్రాలకు చెందిన సుమారు 200 విద్యా సంస్థల నుండి 300 మందికి పైగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్లో ఈ సమావేశంలో పాల్గొన్నారు. దేశంలోని వివిధ ఉన్నత వైద్య, విద్యా సంస్థల నుండి వైద్య నిపుణులు, పరిశోధకులు, విధాన నిర్ణేతలు, ఆరోగ్య సాంకేతిక నిపుణులు ఈ సమావేశంలో పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఛాన్సలర్ పూజ్య స్వామి రామ్‌దేవ్ మహారాజ్ పెద్ద ప్రకటన చేశారు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, త్వరలో పతంజలి ఆయుర్వేద ఆసుపత్రిలో టాటా క్యాన్సర్ హాస్పిటల్, సర్ గంగా రామ్ హాస్పిటల్ సహకారంతో ఆధునిక పద్ధతులను ఉపయోగించి ప్రపంచ స్థాయి చికిత్సను తక్కువ ఖర్చుతో అందించనున్నట్లు ఆయన అన్నారు. ప్రారంభ సెషన్‌లో యోగా రిషి స్వామి రామ్‌దేవ్, పతంజలి విశ్వవిద్యాలయం, ఆయుర్వేద శిరోమణి ఆచార్య బాల్‌కృష్ణ వైస్ ఛాన్సలర్ ఆయుర్వేద అవతారన్, ఇంటిగ్రేటెడ్ పతి, సదస్సు, సారాంశ బుక్‌లెట్‌తో సహా అతిథులు మూడు ముఖ్యమైన పుస్తకాలను కూడా విడుదల చేశారు.

ఈ సందర్భంగా విద్య, పరిశోధనలను ప్రోత్సహించడానికి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ రోపర్, పతంజలి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య బాల్‌కృష్ణ నుండి డాక్టర్ శ్రేయ, డాక్టర్ రాధిక, డాక్టర్ ముఖేష్ మధ్య పరస్పర అవగాహన ఒప్పందం కుదిరింది. ఆధారాల ఆధారిత వైద్యంతో పాటు ఇంటిగ్రేటెడ్ మెడిసిన్ ప్రాముఖ్యతను హైలైట్ చేస్తూ, వైద్య శాస్త్రం డబ్బు సంపాదించడానికి కాదు, ప్రజా సంక్షేమం కోసం ఉండాలని స్వామి రామ్‌దేవ్ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన 9 వైద్య విధానాల గురించి ఆచార్య బాలకృష్ణ మాట్లాడుతూ, ఆయుర్వేదం దాని సామర్థ్యాలకు ప్రసిద్ధి చెందిందని, ఇతర వ్యవస్థలు వాటి నిర్దిష్ట ప్రదేశాలు లేదా సంప్రదాయాలకు ప్రసిద్ధి చెందాయని అన్నారు. మహర్షి చరక్, ఆచార్య సుశ్రుత కాలం గురించి శాస్త్రీయ ఆధారాలు, భౌగోళిక, పర్యావరణ ఆధారాలను కూడా ఆయన వివరంగా వివరించారు. పతంజలి ఆయుర్వేద ఆసుపత్రిలో ఆధునిక వైద్య వ్యవస్థ ద్వారా తక్కువ ఖర్చుతో ప్రపంచ స్థాయి చికిత్స అందించబడుతుందని, వైద్యం పేరుతో కుట్ర, దోపిడీని అంతం చేయడానికి కృషి జరుగుతుందని ఆయన అన్నారు. సెంట్రల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ శ్రీనివాస్ బరే?డి, డాక్టర్ విపిన్ కుమార్ జనరల్ సెక్రటరీ ఇంటిగ్రేటెడ్ ఆయుష్ కౌన్సిల్, డాక్టర్ సునీల్ అహుజా, పద్మశ్రీ డాక్టర్ బిఎన్ గంగాధర్ నేషనల్ మెడికల్ కమిషన్ చైర్మన్, డాక్టర్ విశాల్ మాగో ప్రొఫెసర్, బర్న్ అండ్ ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి ఎయిమ్స్ రిషికేశ్ కూడా ఈ కార్యక్రమంలో ప్రసంగించారు. ఆయుష్ కార్యక్రమం, మొదటి సెషన్ నేషనల్ మెడికల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ బిఎన్ గంగాధర్, ఆయుష్ మంత్రిత్వ శాఖ ఒడిశా ప్రభుత్వ సాధికార కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ డి గోపాల్ సి నందా అధ్యక్షతన ప్రారంభమైంది.

ఇందులో పంజాబ్‌లోని హోషియార్‌పూర్‌లోని గురు రవిదాస్ ఆయుర్వేద విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ వైద్య రాకేష్ శర్మ, ఎయిమ్స్ రిషికేశ్‌లోని ఇఎన్‌టి విభాగం ప్రొఫెసర్, విభాగాధిపతి డాక్టర్ మను మల్హోత్రా, కోల్‌కతాలోని జాదవ్‌పూర్ విశ్వవిద్యాలయం ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ విభాగం ప్రొఫెసర్ ప్రొఫెసర్ పులక్ ముఖర్జీ తమ పరిశోధనలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమం రెండవ సెషన్‌లో, ఎయిమ్స్ రిషికేశ్‌లోని జెరోంటాలజీ విభాగం ప్రొఫెసర్, విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ మీనాక్షి ధర్, పతంజలి ఆయుర్వేద మహావిద్యాలయ ఫిజియోథెరపీ విభాగం పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్య డీన్ డిసిబి ధన్‌రాజ్ అనే ఇద్దరు వక్తలు మూడు వ్యాధుల నిర్ధారణపై తమ పరిశోధనలను ప్రదర్శించారు, అవి సిఓపిడి. దీని తరువాత, జైపూర్‌లోని డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద ప్రొఫెసర్ పి.హేమంత కుమార్, పతంజలి ఆయుర్వేద మహావిద్యాలయ సర్జరీ విభాగం ప్రొఫెసర్ సచిన్ గుప్తా ఫిస్టులా నిర్ధారణపై తమ పరిశోధనలను ప్రదర్శించారు. అదే క్రమంలో పతంజలి ఆయుర్వేద మహావిద్యాలయ ప్రొఫెసర్ హెల్త్ సర్కిల్, యోగా విభాగం డాక్టర్ రామన్ సంత్రా, డాక్టర్ ధీరజ్ కుమార్ త్యాగి, ఎయిమ్స్ రిషికేశ్ వైద్య విభాగం డాక్టర్ మోనికా పఠానియా వ్యాధి నివారణ పద్ధతులపై తమ పరిశోధనలను ప్రదర్శించారు. ఇదే క్రమంలో సమాంతరంగా జరుగుతున్న పోస్టర్ సెషన్‌కు డాక్టర్ ప్రదీప్ నయన్, డాక్టర్ రష్మి అతుల్ జోషి, డాక్టర్ కనక్ సోని మరియు డాక్టర్ రామకాంత్ మార్డే అధ్యక్షత వహించారు. ప్రారంభ సెషన్‌లో పతంజలి విశ్వవిద్యాలయ ఛాన్సలర్ పరమ పూజ్య స్వామి రామ్‌దేవ్ జీ మహారాజ్, వైస్ ఛాన్సలర్ పరమ పూజ్య ఆచార్య బాలకృష్ణ మహారాజ్ ముఖ్య అతిథులను పూలమాలలు వేసి, అంగవస్త్రం, గంగాజలి సమర్పించి స్వాగతించారు. ఆ తర్వాత ముఖ్య అతిథులు దీపాలు వెలిగించడం, పతంజలి విశ్వవిద్యాలయానికి చెందిన చంద్రమోహన్, అతని బృందం కుల్ గీత్, ధన్వంతరి వందన ప్రదర్శనతో సమావేశం ప్రారంభమైంది. తర్వాత పతంజలి పరిశోధనా సంస్థ ఉపాధ్యక్షుడు డాక్టర్ అనురాగ్ జీ స్వాగత ప్రసంగం చేశారు.

# పరిశుభ్రం.. ఆరోగ్యకరం!



నేటితరం మహిళలు నవ్యతకు పెద్దపీట వేస్తున్నారు. కాలి చెప్పులు మొదలుకొని.. కళ్ల కాటుక వరకూ అన్నీ ఆధునికంగా ఉండాలని కోరుకుంటున్నారు. ఆధునిక వస్తువులతో అనేక ప్రయోజనాలు పొందుతున్నా.. కొన్ని విషయాల్లో మాత్రం పాతకాలపు పద్ధతులనే పాటిస్తున్నారు. ముఖ్యంగా, నెలసరి సమయంలో ఉపయోగించే 'మెన్‌స్ట్రువల్ కప్' విషయంలో.. భారతీయ మహిళలు ఇప్పటికీ అపనమ్మకంతోనే ఉన్నారట. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) లక్నో.. ఇటీవల నిర్వహించిన ఒక అధ్యయనం ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ క్రమంలో ఆరోగ్యంతోపాటు పర్యావరణానికీ అనుకూలంగా ఉండే 'మెన్‌స్ట్రువల్ కప్' వాడకం పెంచేలా మహిళలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉన్నదని గైనకాలజిస్టులు చెబుతున్నారు. పునర్వినియోగించే అవకాశమున్న ఈ సిలికాన్ కప్‌లను.. సాధారణ ప్యాడ్‌ల కన్నా ఎక్కువ సమయంపాటు ఉపయోగించొచ్చు.రోజూ ఆరు నుంచి ఎనిమిది గంటల వరకూ వాడుకోవచ్చు. రక్తస్రావం తక్కువగా ఉన్నట్టయితే.. 12 గంటల వరకూ మార్చుకున్నా ఫర్వాలేదని గైనకాలజిస్టులు అంటున్నారు. దీర్ఘకాలంలో వాడే సాధారణ ప్యాడ్‌లకన్నా.. ఇది ఎంతో చవకైనది కూడా. వీటిని తరచుగా మార్చాల్సిన అవసరం ఉండదు. అంతేకాకుండా.. ప్యాడ్ వల్ల వచ్చే అలర్జీలు, ఇన్ఫెక్షన్లు రాకుండా ఉంటాయి. అయితే, ఈ 'మెన్‌స్ట్రువల్ కప్' మొదటిసారి ఉపయోగించేవారికి కాస్త అసౌకర్యంగా ఉంటుంది. వాటిని శుభ్రం చేయడం కూడా చిరాకుగా అనిపిస్తుంది. కానీ, ఇవి మహిళల ఆరోగ్యానికి, పరిశుభ్రతకు ఎంతో ఉపయోగపడతాయని పలు అధ్యయనాలు వెల్లడించాయి. అయితే.. 'మెన్‌స్ట్రువల్ కప్' ఎంచుకునే విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. మహిళలకు సరిపడే రకాలనే ఎంచుకోవాలి. వాటిని సురక్షితంగా అమర్చుకోవడం కూడా చాలా ముఖ్యమైన విషయం.

# మూత్రంలో రక్తం వస్తే కిడ్నీల్లో ఫిల్టర్లు దెబ్బతిన్నట్లేనా





కిడ్నీలు.. మన శరీరంలోని విషతుల్యమైన పదార్థాలను వడపోసి మూత్రం ద్వారా బయటికి పంపుతాయి. హార్మోన్లు, ఎంజైమ్స్ విడుదలలో కీలక పాత్ర పోషిస్తాయి. ప్రతి మనిషికీ చిక్కుడు గింజ ఆకారంలో రెండు మూత్రపిండాలు ఉంటాయి. ఒక్కో మూత్రపిండంలో 10 లక్షల నుంచి 12 లక్షల ఫిల్టర్లు ఉంటాయి. రక్తాన్ని వడపోస్తూ అందులోని వ్యర్థాలను తొలగించడమే వీటి పని. ఈ ప్రక్రియలో భాగంగా కొంత ప్రొటీన్ మూత్రం ద్వారా బయటికి వెళ్తుంది. ఈ ప్రొటీన్ ఎక్కువ మోతాదులో బయటికి వెళ్లినప్పుడు కిడ్నీలు 'గ్లోమెరులార్' వ్యాధికి గురవుతాయి. తీవ్రంగా దెబ్బతింటాయి కూడా. ఈ వ్యాధికి సంబంధించి లోతైన పరిశోధనలు జరుగుతున్నాయి. ప్రస్తుతం అత్యాధునిక ఔషధాలు, సమర్థమైన చికిత్సా పద్ధతులు అందుబాటులో ఉన్నాయి.రక్తాన్ని వడపోయడంలో అత్యంత కీలకపాత్ర పోషిస్తాయి కిడ్నీలు. వాటిలోని సూక్ష్మమైన రక్తనాళికలు ఒక గుచ్ఛంలా ఏర్పడి ఉంటాయి. ఆ సముదాయాన్నే 'గ్లోమెరులార్స్' అంటారు. వాడుక భాషలో 'ఫిల్టర్స్' అనీ పిలుస్తారు. ఒక్కో కిడ్నీలో 10లక్షల నుంచి 12లక్షల వరకు గ్లోమెరులార్స్ ఉంటాయి. తక్కువ బరువుతో పుట్టే పిల్లల్లో జన్మతః ఫిల్టర్లు తక్కువ సంఖ్యలో ఉంటాయి. వయసు పెరుగుతున్నప్పుడు కూడా ఫిల్టర్ల సంఖ్య క్రమంగా తగ్గుతుంది.అయినా కిడ్నీల పనితనంలో ఎలాంటి మార్పూ ఉండదు. ఏదైనా కారణం వల్ల ఈ ఫిల్టర్లు దెబ్బతిన్నప్పుడు, మూత్రం ద్వారా ఎక్కువ మోతాదులో ప్రొటీన్ బయటికి వెళ్లిపోతుంది. దీనివల్ల కిడ్నీలు దెబ్బ తింటాయి. సాధారణంగా, ఎవరికైనా 20–50 మిల్లీగ్రాముల ప్రొటీన్ మూత్రంలో పోవడం సహజమే. అంతకు మించి.. అంటే, ఒక గ్రాము లేదా అంతకంటే ఎక్కువ వెళ్లిపోతే మాత్రం సదరు రోగికి కిడ్నీ సమస్యలు ఉన్నాయనిచెప్పవచ్చు.మూడు గ్రాములకు మించి ప్రొటీన్ విడుదలైన పుడు దాన్ని 'నెఫ్రోటిక్ సిండ్రోమ్' అంటారు. ఈ రుగ్మత అప్పుడే పుట్టిన పిల్లల నుంచి వృద్ధుల వరకు ఏ వయసు వారికైనా రావచ్చు. రక్తంలో ప్రొటీన్ అనేది చాలా అవసరం. మోతాదుకు మించి బయటికి పోయినప్పుడు కిడ్నీలు విఫలం అవుతాయి. 'గ్లోమెరులార్' వ్యాధి తత్వమే ఇది. ఫలితంగా అనేకానేక రుగ్మతలు చుట్టుముడతాయి. గ్లోమెరులార్ వ్యాధులు ప్రధానంగా పది రకాలు. అందులో ఎక్కువ శాతం కనిపించేవి.ఇది నిపుణులు మొట్టమొదట గుర్తించిన గ్లోమెరులార్ వ్యాధి. దీనిపై ప్రపంచవ్యాప్తంగా అనేక పరిశోధనలు జరుగుతున్నాయి. కొంతమందిలో ఈ జబ్బు సోకిన వెంటనే, అతి వేగంగా ముదురుతుంది. వ్యాధిని గుర్తించేలోపే జరగరాని నష్టం జరిగిపోతుంది. కిడ్నీ వ్యాధిగ్రస్తుల్లో 70 శాతం మందికి ఐజీఏ నెఫ్రోపతి వల్లనే మూత్రపిండాలు దెబ్బతింటాయి. ఈ మధ్యకాలంలో యువత సైతం ఈ వ్యాధి బారిన పడుతున్నది. సాధారణంగా రుగ్మత లక్షణాలు పైకి పెద్దగా కనిపించవు. దీంతో వ్యాధి తీవ్రతను చాలామంది ఆలస్యంగా గుర్తిస్తారు.అప్పటికే కిడ్నీలు విఫలం అయిపోయి ఉంటాయి. ముఖ్యంగా ఈ వ్యాధి వల్ల రక్తపోటు పెరుగుతుంది. అందుకని, నలభై ఏండ్లలోపు వారిలో అధిక రక్తపోటు సమస్యలు కనిపిస్తే.. వెంటనే మూత్రపిండ పరీక్షలు చేయించుకోవాలి. ప్రొటీన్, ఎర్ర రక్తకణాలు మూత్రంలో ఎక్కువగా పోతున్నట్టు గుర్తిస్తే గ్లోమెరులార్ రుగ్మతతో బాధపడుతున్నట్టు అనుమానించాల్సి ఉంటుంది. సాధారణంగా రక్తంలో క్రియాటిన్.

1.2 ఎంజీ ఉండాలి. అలా కాకుండా

1.3 లేదా అంతకంటే ఎక్కువ ఉంటే కిడ్నీ సమస్య ఉన్నట్టు.

2. మెంబ్రేనస్ నెఫ్రోపతి

ఐజీఏ నెఫ్రోపతి తరువాత ఎక్కువగా కనిపించే కిడ్నీ వ్యాధి. ఇది కూడా స్త్రీ, పురుషులు ఇద్దరిలో రావచ్చు. దీనివల్ల రక్తపోటు పెరుగుతుంది.

3. ల్యూపస్ నెఫ్రోపతి

మహిళల్లో ఎక్కువగా వచ్చే వ్యాధి. అందుకని వారిలో రక్తపోటు అకస్మాత్తుగా పెరిగిపోతే .. వెంటనే కిడ్నీ పరీక్షలు చేయించడం ఉత్తమం. మూత్రంలో ప్రొటీన్ ఎక్కువ మోతాదులో పోతున్నట్లు నిర్ధారణ జరిగినా కూడా.. కిడ్నీ సమస్యగా గుర్తించి

తదుపరి పరీక్షలు చేయించాలి. వ్యాధి దశను కచ్చితంగా గుర్తించి, చికిత్స అందించాలి.

4. ఎంసీడీ నెఫ్రోపతి

మినిమల్ చేంజ్ డిసీజ్.. ఎంసీడీ నెఫ్రోపతి అనేది చిన్నపిల్లల్లో వచ్చే కిడ్నీ వ్యాధి. తొలిదశలోనే కనిపెట్టి, కచ్చితమైన వైద్యం చేయించాలి.

5. అమైలైడోసెస్ నెఫ్రోపతి

ఈ వ్యాధి వృద్ధుల్లో ఎక్కువగా వస్తుంది. నలభై దాటిన తరువాత కనీసం సంవత్సరానికి ఒక సారైనా కిడ్నీ పనితీరు పరీక్షలు చేయించుకోవాలి.

6. ఎక్లాంప్సియా నెఫ్రోపతి

ఇది గర్భిణులలో వస్తుంది. వారిలో అకస్మాత్తుగా రక్తపోటు పెరిగిపోతుంది. అందుకే, అసాధారణంగా పెరిగే బీపీని నిర్లక్ష్యం చేయకూడదు.

### అందుబాటులోని చికిత్సలు..

వ్యాధి ప్రారంభ దశ అయితే.. మందులతో చికిత్స చేయవచ్చు. మొదటి దశలో ఉన్నప్పుడు మాత్రమే ఇవి మంచి ఫలితాలను ఇస్తాయి. వ్యాధి రెండో దశకు చేరితే డయాలసిస్ చేయాల్సి ఉంటుంది. వ్యాధి చివరి దశ లేదా మూడో దశకు చేరితే.. కిడ్నీ మార్పిడి ఒక్కటే మార్గం. పరిస్థితి అంతవరకు రాకుండా జాగ్రత్త పడాలి.తక్కువ బరువుతో పుట్టే పిల్లల్లో జన్మతః ఫిల్టర్లు తక్కువ సంఖ్యలో ఉంటాయి. వయసు పెరుగుతున్నప్పుడు కూడా ఫిల్టర్ల సంఖ్య క్రమంగా తగ్గుతుంది.అయినా కిడ్నీల పనితనంలో ఎలాంటి మార్పూ ఉండదు. ఏదైనా కారణం వల్ల ఈ ఫిల్టర్లు దెబ్బతిన్నప్పుడు, మూత్రం ద్వారా ఎక్కువ మోతాదులో ప్రొటీన్ బయటికి వెళ్లిపోతుంది. దీనివల్ల కిడ్నీలు దెబ్బ తింటాయి. సాధారణంగా, ఎవరికైనా 20–50 మిల్లీగ్రాముల ప్రొటీన్ మూత్రంలో పోవడం సహజమే. అంతకు మించి.. అంటే, ఒక గ్రాము లేదా అంతకంటే ఎక్కువ వెళ్లిపోతే మాత్రం సదరు రోగికి కిడ్నీ సమస్యలు ఉన్నాయనిచెప్పవచ్చు.మూడు గ్రాములకు మించి ప్రొటీన్ విడుదలైన పుడు దాన్ని 'నెఫ్రోటిక్ సిండ్రోమ్' అంటారు. ఈ రుగ్మత అప్పుడే పుట్టిన పిల్లల నుంచి వృద్ధుల వరకు ఏ వయసు వారికైనా రావచ్చు. రక్తంలో ప్రొటీన్ అనేది చాలా అవసరం. మోతాదుకు మించి బయటికి పోయినప్పుడు కిడ్నీలు విఫలం అవుతాయి. 'గ్లోమెరులార్' వ్యాధి తత్వమే ఇది. ఫలితంగా అనేకానేక రుగ్మతలు చుట్టుముడతాయి. గ్లోమెరులార్ వ్యాధులు ప్రధానంగా పది రకాలు. అందులో ఎక్కువ శాతం కనిపించేవి.

# నాడులు చెదరకుండా మెదడుకు అండాదండా



మెదడులో గడ్డ అనగానే ఉలికిపడతాం. ప్రాణభయంతో వణికిపోతాం. కానీ గడ్డ ఎలాంటిదైనా, ఎంత పరిమాణంలో ఉన్నా, ఏ రకమైనా%ా% దాన్నుంచి విముక్తి కలిగించి ప్రాణాలను తిరిగి నిలబెట్టే సురక్షితమైన, అంతిమ చికిత్స 'ఇంట్రా ఆపరేటివ్ న్యూరో మానిటరింగ్' ఆపరేషన్. మెదడుకు సంబంధించిన గడ్డల విషయంలో ఈ సర్జరీ విధానాన్ని మించిన సమర్థమైన, ఫలవంతమైన, సురక్షితమైన చికిత్స ఇప్పటివరకు ఇంకొకటి లేదు.కిరణ్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్.. 32 ఏండ్లు. ఆఫీసులో సహోద్యోగులతో మాట్లాడేటప్పుడు అతనికి ఉన్నట్టుండి నాలుక సహకరించడం మానేసింది. ఎందుకిలా జరుగుతుందని వైద్యులను కలిసి పరీక్షలు చేయిస్తే, మెదడులో క్యాన్సర్ గడ్డ మాటలకు సంబంధించిన నాడిని నొక్కేస్తున్నట్టు తేలింది. మెదడులో క్యాన్సర్ గడ్డ అనగానే కిరణ్ సర్జరీ గురించి ఎంతో భయపడిపోయాడు. మెదడుకు సర్జరీ అంటే ఏమైనా జరగవచ్చు. ఏమాత్రం పొరపాటు జరిగినా నాడులు దెబ్బతిని మాట పూర్తిగా పోవచ్చు. అంతకుమించిన నష్టం కూడా జరిగే ప్రమాదం ఉంది. అయితే తన భయాలన్నీ అర్థం లేనివని సర్జరీ తర్వాత కిరణ్‌కు అర్థమైంది. సర్జరీతో క్యాన్సర్ నుంచి శాశ్వత విముక్తి పొందడమే కాకుండా, మునుపటిలా ధారాళంగా మాట్లాడగలుగుతున్నాడు. మెదడులో గడ్డల చికిత్సలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న అత్యాధునిక ఇంట్రా ఆపరేటివ్ ఎంఆర్ఐ, న్యూరో నేవిగేషన్, న్యూరో మానిటరింగ్ పరికరాలు, సౌకర్యాలు, అనుభవజ్ఞులైన న్యూరో సర్జన్ డాక్టర్ల వల్లే ఇది సాధ్యపడింది. క్లిష్టమైన నాడీ విభాగానికి సంబంధించిన మెదడు సర్జరీలలో ఉపయోగించే ఇంట్రా ఆపరేటివ్ న్యూరో మానిటరింగ్ టెక్నిక్‌ల గురించి, ఈ చికిత్స ఉపయోగాల గురించి తెలుసుకోవాలి.

### మెదడులో గడ్డలు..

మెదడులో క్యాన్సర్ (మాలిగ్నెంట్) లేదా క్యాన్సర్ కాని (బినైన్) రెండు రకాల గడ్డలు తలెత్తుతూ ఉంటాయి. ఇవి ఏర్పడ్డ ప్రదేశాన్ని బట్టి అక్కడి నాడులతో సంబంధం ఉన్న అవయవాలు ప్రభావితమవుతూ ఉంటాయి. ఇలాంటప్పుడు సర్జరీతో ఆ ప్రదేశంలో గడ్డను తొలగించాలి. ఇంట్రా ఆపరేటివ్ న్యూరో మానిటరింగ్ విధానం అందుబాటులోకి రాకముందు మెదడులోని గడ్డలను తొలగించే సర్జరీ సమయంలో కేవలం కంటికి కనిపించినంత మేరకే గడ్డను తొలగించేవారు. ఆ సమయంలో అక్కడి నాడులు ఎంతమేరకు పనిచేస్తున్నాయి? వాటికి స్పందనలు ఉన్నాయా? అనే విషయాలను వైద్యులు తెలుసుకునే వీలు ఉండేది కాదు. దాంతో నాడికి నష్టం జరగకుండా గడ్డను తొలగించడం మీదే వైద్యులు దృష్టి పెట్టేవారు. ఆ జాగ్రత్తలో భాగంగా నాడికి నష్టం జరగకుండా ఉండటం కోసం తొలగించే వీలున్నా కొంత క్యాన్సర్ గడ్డను అలాగే వదిలేసి, కుట్లు వేసేవారు. అలా సర్జరీ ముగిసిన తర్వాత రేడియేషన్, కీమోథెరపీలతో క్యాన్సర్ నయం చేసేవారు. కానీ, పూర్తిగా తొలగించకుండా వదిలేసిన ఆ కొద్ది క్యాన్సర్ గడ్డ తర్వాతి కాలంలో పెరిగి సమస్యలు తెచ్చి పెడుతుంది. దీంతో రెండోసారి సర్జరీ అవసరం పడేది. అయినా కూడా పూర్తి ప్రయోజనం దక్కడం అనుమానమే.కాబట్టి, బ్రెయిన్ ట్యూమర్ సర్జరీ సమయంలో నాడులు దెబ్బతినకుండా ఉండాలంటే క్యాన్సర్ గడ్డ చుట్టూ ఉన్న నాడులకు ఏయే అవయవాలతో సంబంధం ఉందో, ఆ అవయవాలు స్పందిస్తున్నాయా లేదా అనేది గమనిస్తూ ఉండాలి. ఉదాహరణకు, కాలుకు సంబంధించిన నాడులకు స్పందనలు ప్రసారం చేసే మెదడులోని ఓ భాగంలో గడ్డ ఏర్పడింది అనుకుందాం. ఆ ప్రదేశంలో నాడి చుట్టూ పరుచుకుని ఉన్న ఆ గడ్డను తొలగిస్తున్నప్పుడు మెదడు నుంచి ఆ నాడికి సంకేతాలు అందుతున్నాయో, లేదో గమనిస్తూ సర్జరీ చేయవలసి ఉంటుంది. ఇలాంటి వీలు ఉంటేనే వైద్యులు గడ్డను నూటికి నూరు శాతం తొలగించగలుగుతారు. ఇందుకు ఇంట్రా ఆపరేటివ్ సర్జరీలోని 'న్యూరో మానిటరింగ్' అనే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం దోహదపడుతుంది. అయితే, ఈ చికిత్సలో నాడులకు మెదడు నుంచి అందే స్పందనలను తెలుసుకోవాలంటే రోగిని మెలకువతో ఉంచి సర్జరీ చేయాలి. అందువల్ల మిగతా సర్జరీల్లో లాగ రోగికి జనరల్ అనస్థీషియా ఇవ్వడం సాధ్యపడదు. కాబట్టి నొప్పి తెలియకుండా, రోగిని మెలకువగా ఉంచే ప్రత్యేకమైన మత్తు ఇంజెక్షన్లు ఇస్తారు. ఇలాచేసే సర్జరీని అవేక్ సర్జరీ అంటారు.న్యూరో మానిటరింగ్ సాయంతో ఆపరేషన్ థియేటర్‌లో ఉండే టెక్నీషియన్లు%ా% సర్జరీ చేస్తున్నప్పుడు నాడుల స్పందనను గమనిస్తూ, ఏ చిన్న తేడా వచ్చినా వైద్యులను అప్రమత్తం చేస్తారు. దాంతో వైద్యులు నాడి దెబ్బతినకుండా ఎంతో జాగ్రత్తగా గడ్డను తొలగిస్తారు. నాడి దెబ్బతింటున్నది అని హెచ్చరికలు వస్తే, మరింత లోతుకు వెళ్లకుండా ఆగిపోతారు. మరీ ముఖ్యంగా ఇలాంటి గడ్డల కారణంగా నాడులు దెబ్బతిని ముఖాన్ని అందవిహీనంగా మార్చేసే పాక్షిక పక్షవాతానికి గురికాకుండా ఉండాలంటే ఇంట్రా ఆపరేటివ్ న్యూరో మానిటరింగ్ చికిత్సనే ఆశ్రయించాలి. మిగిలిపోయిన గడ్డను కీమోథెరపీ, రేడియేషన్లతో కరిగించవచ్చు. ఇలా జాగ్రత్త పడటం వల్ల నాడి సురక్షితంగా ఉండి, ముఖం యథాతథంగా ఉంటుంది. దాంతో జీవన నాణ్యత పెరుగుతుంది. అదే సమయంలో క్యాన్సర్ నుంచి పూర్తి విముక్తి దక్కుతుంది.

### గడ్డకు త్రీడి రూపం..

న్యూరో నేవిగేషన్ నేవిగేషన్ అంటే 'దారి చూపించడం'. మెదడు, దానిలో గడ్డ, అది పెరిగిన తీరు, మెదడులో అది చొచ్చుకువెళ్లిన దూరం, గడ్డవల్ల నాడుల మీద పడే ఒత్తిడి.. ఇవన్నీ కంటితో చూసి కనిపెట్టలేం! కానీ ఇంట్రా ఆపరేటివ్ న్యూరో మానిటరింగ్ చికిత్సా విధానంలోని న్యూరో నేవిగేషన్ మెదడు, గడ్డ, నాడులు%ా% ఈ మూడిటిని మూడు కోణాల్లో స్పష్టంగా చూపిస్తుంది. ఈ సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రాని రోజుల్లో వైద్యులు కేవలం తమ అనుభవాన్ని బట్టి గడ్డ పరిమాణాన్ని, ప్రదేశాన్ని అంచనా వేసి సర్జరీతో తొలగించేవారు. ఇలా చేయడం వల్ల నాడులు దెబ్బతినవచ్చు. గడ్డ ఎంతోకొంత మెదడులోనే మిగిలిపోవచ్చు. లేదంటే గడ్డను తొలగించే క్రమంలో నాడులకు నష్టం జరిగి పక్షవాతం కూడా రావచ్చు. కానీ, న్యూరో నేవిగేషన్‌తో నాడులకు ఏమాత్రం నష్టం జరగకుండా నేర్పుగా, సమూలంగా గడ్డను తొలగిస్తున్నారు.

### సత్వర స్కానింగ్..

మెదడులో అవసరమైనంత మేరకు గడ్డ తొలగించి కుట్లు వేసిన తర్వాత, ఎంఆర్ఐ పరీక్షలో మరికొంత క్యాన్సర్ గడ్డ మిగిలిపోయిందని తేలితే? ఆ గడ్డను తొలగించడం కోసం మరొక సర్జరీ చేయడం శ్రమ, ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. అలాగని ఆ గడ్డను వదిలేస్తే అది తిరిగి పెరిగిపోయి ప్రాణాంతకం కావచ్చు. కాబట్టి ఇలాంటి పొరపాట్లకు వీలు లేకుండా సర్జరీ చేస్తున్నప్పుడే, గడ్డను తొలగించి, తెరిచిన పుర్రెను మూయక ముందే ఎంఆర్ఐ స్కానింగ్ చేసే వెసులుబాటు ఈ ఇంట్రా ఆపరేటివ్ న్యూరో మానిటరింగ్ సర్జరీలో ఉంది. దీంతో అక్కడికక్కడే, అప్పటికప్పుడే గడ్డను పూర్తిగా తొలగించిందీ లేనిదీ తెలుసుకోవచ్చు. ఎంఆర్ఐ ఫలితాన్నిబట్టి గడ్డ ఇంకా మిగిలి ఉంటే వైద్యులు దాన్నికూడా సమూలంగా తొలగించి సర్జరీ ముగిస్తారు. దీనివల్ల క్యాన్సర్ నుంచి శాశ్వత విముక్తి కలుగుతుంది.

### ముదరక ముందే చికిత్స

క్యాన్సర్ అయినా, కాకపోయినా మెదడులో తలెత్తిన గడ్డలను తొలగించక తప్పదు. అయితే గడ్డ పరిమాణం పెరిగేకొద్దీ సమస్యలూ, నష్టం ఎక్కువవుతూ ఉంటాయి. కాబట్టి గడ్డ చిన్నదిగా ఉన్నప్పుడే త్వరపడాలి. చిన్నగడ్డ అయితే నరాలు దెబ్బతినకుండా ఉంటాయి. సర్జరీ తర్వాత క్యాన్సర్ నుంచి పూర్తిగా కోలుకునే అవకాశాలూ పెరుగుతాయి. క్యాన్సర్ తిరగబెట్టే పరిస్థితులూ తగ్గిపోతాయి. అలా కాకుండా గడ్డ పెద్దగా మారిన తర్వాత సర్జరీకి వెళ్తే ఎక్కువ నాడులకు నష్టం జరుగుతుంది. పైగా సర్జరీ తర్వాత కిమోథెరపీ, రేడియేషన్ అవసరం పెరుగుతుంది కూడా! ఇంకా క్యాన్సర్ తిరగబెట్టే ప్రమాదమూ ఎక్కువే.

### సర్జరీతో ఉపయోగాలు

మెదడులో గడ్డలను సమూలంగా తొలగించడంతోపాటు, ఎలాంటి దుష్ప్రభావాలకూ తావులేకుండా రోగికి నాణ్యమైన, మెరుగైన జీవితాన్ని అందించే ఉన్నతమైన చికిత్స ఇంట్రా ఆపరేటివ్ న్యూరో మానిటరింగ్. ఈ సర్జరీతో మెదడులో గడ్డలను నూటికి నూరు శాతం తొలగించవచ్చు. అదే సమయంలో నాడులతోపాటు వాటినుంచి అవయవాలకు అందే స్పందనలను గమనిస్తూ, వాటిని కాపాడుకోవచ్చు. క్యాన్సర్ నుంచి శాశ్వత విముక్తి పొందవచ్చు. సర్జరీ నుంచి కోలుకునే సమయాన్నీ తగ్గించుకోవచ్చు. ఇన్ని ఉపయోగాలు మెదడులో గడ్డలను తొలగించే మరే ఇతర చికిత్సల్లోనూ ఉండవు.

### వెన్ను సమస్యలకు కూడా

పుట్టుకతో కొంతమంది పిల్లలకు వెన్ను తెరుచుకొని ఉంటుంది. మరికొందరికి వెన్నుపాము వంకరగా ఉంటుంది. తెరుచుకుని ఉన్న వెన్నును సర్జరీతో మూయడానికి కూడా ఇంట్రా ఆపరేటివ్ న్యూరో మానిటరింగ్ ఉత్తమ చికిత్సగా నిలుస్తుంది. ఇక వెన్నుపాము మధ్యలో ఉండే నాడుల సముదాయం దెబ్బతింటే అవయవాలు శాశ్వత పక్షవాతానికి గురయ్యే ప్రమాదం ఉంటుంది. కాబట్టి, ఈ నాడులకు మెదడు నుంచి స్పందనల ప్రసారాన్ని గమనిస్తూ సర్జరీ చేయవలసి ఉంటుంది. ఈ వెసులుబాటు ఇంట్రా ఆపరేటివ్ న్యూరో మానిటరింగ్ విధానంలోనే ఉంది. అలాగే వంకరగా ఉన్న వెన్నుపూసలను సరిచేసే (స్కోలియాసిస్), వెన్ను నిటారుగా మార్చడానికి కూడా ఈ విధానాన్ని ఆశ్రయించవచ్చు. వెన్నులోని నాడులు దెబ్బ తినకుండా సురక్షితంగా ఉండేలా జాగ్రత్తపడుతూ, వెన్నును సరిచేయడం ఈ విధానంతోనే సాధ్యం. అంతేకాకుండా, వెన్నుపాములో గడ్డలను తొలగించడానికి కూడా ఈ విధానమే శ్రేయస్కరం.

### యశోదా ఆస్పత్రిలోనే..

ఇంట్రా ఆపరేటివ్ ఎంఆర్ఐ సదుపాయం దక్షిణ భారతదేశం మొత్తంలో ఒక్క సికింద్రాబాద్ యశోదా ఆస్పత్రిలోనే అందు బాటులో ఉంది. ఈ పరికరాలను ఉపయోగించాలంటే శిక్షణ పొందిన మెరుగైన సాంకేతిక నిపుణులు అవసరం. ఇలాంటి ట్రెయిన్డ్ అనస్థీషియన్లు యశోదా ఆస్పత్రిలో పనిచేస్తున్నారు.

# అయోధ్యకు వెళ్తే వీటిని చూడడం అస్సలు మిస్సవ్వొద్దు











యావత్ భారతదేశం దృష్టంతా అయోధ్య వైపే ఉన్నది. రామ మందిరం ప్రారంభోత్సవంతో పాటు రామ్‌లల్లా విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ కనుల పండువలా సాగింది. ఎన్నో శతాబ్దాల భారతీయుల కల సాకారమైంది. ఈ క్రమంలో భారతంలో పండుగ వాతావరణం నెలకొన్నది. దాదాపు 500 సంవత్సరాల సుదీర్ఘ నిరీక్షణ అనంతరం ఆలయం రూపుదిద్దుకొని బాల రాముడు భక్తులకు సాక్షాత్కరించాడు. ఈ నేపథ్యంలో చాలా మంది రాముడి జన్మస్థలమైన అయోధ్యకు వెళ్లాలని భావిస్తుంటారు. అయితే, కేవలం అయోధ్యలో రామ మందిరమే కాకుండా ఇంకా ఎన్నో ప్రసిద్ధి ఆలయాలు, ప్రదేశాలు సైతం ఉన్నాయి. ఎవరైనా అయోధ్యకు వెళ్లేందుకు ప్లాన్ చేసుకుంటే ఈ ప్రాంతాలను సైతం చూడడం అస్సలు మిస్సవ్వొద్దు. అక్కడ ఏయే చారిత్రక, పర్యాటక ప్రాంతాలున్నాయో ఓలుక్కేద్దాం..!

### హనుమాన్ గర్హి

అయోధ్యలో మరో చారిత్రాత్మక ఆలయం ఉన్నది. అదే హనుమాన్‌గర్హి, ఇక్కడ గుహ కూడా ఉంటుంది. ఇందులోనే హనుమంతుడు నివసిస్తున్నాడని ఇక్కడి ప్రజల విశ్వాసం. అందుకు అయోధ్యకు వెళ్లిన ప్రతి ఒక్కరూ హనుమాన్ గర్హిని సైతం తప్పక దర్శిస్తుంటారు. హనుమాన్ గర్హి ఆలయం నాలుగు వైపుల కోట ఆకారంలో ఉంటుంది. ప్రతి మూలలో వృత్తాకార ప్రాకారాలు కనిపిస్తాయి. ప్రధాన ఆలయానికి చేరుకోవడానికి 76 మెట్లు ఏర్పాటు చేశారు. ఇక్కడ హనుమంతుడు ఆరు అంగులాల ఎత్తులో బాలుడి రూపంలో కనిపిస్తాడు. తల్లి అంజనీదేవి ఒడిలో ఉన్నట్లుగా ఉంటుంది. హనుమంతుడిచే రామనామం రాయబడిన వెండి తులసీహారం అలంకరించి ఉంటుంది. ఆలయ గోడలపై హనుమాన్ చాలీసా శ్లోకాలు కనిపిస్తాయి. ఆలయంలో ఓ స్తంభం ఉంటుంది. దాన్ని విజయం స్తంభంగా పిలుస్తుంటారు. అయోధ్యలోని రామ మందిరాన్ని సందర్శించే భక్తులు ముందుగా హనుమాన్ గర్హిని దర్శించడం ఆనవాయితీ.

### కనక్ భవన్

అయోధ్యలో రామాయణ కాలానికి చెందిన కనక్ భవన్ సైతం ఉంది. శ్రీరాముడు సీతాదేవిని వివాహమాడిన తర్వాత కైకేయి సీతాదేవికి కానుకగా ఇచ్చినట్లు స్థల పురాణం చెబుతున్నది. ఈ భవనం సీతారాముల ఆంతరంగిక భవనంగా ఉండేదని ప్రతీతి. అయోధ్యలో ఉన్న ఈ భవన్ అద్భుతమైన శిల్పకళా వైభవానికి నిదర్శనంగా నిలుస్తుంది. ఈ భవనంలో సీతారాముల విగ్రహాలుంటాయి. త్రేతాయుగం నాటి ఈ భవనం శిథిలావస్థకు చేరితే ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడు స్వయంగా నిర్మించాడని చరిత్ర చెబుతున్నది. మధ్యయుగ కాలంలో విక్రమాదిత్య చక్రవర్తి, ఆ తర్వాత ఓర్చా రాణి వృషభాను కున్వారి పునరుద్ధరించినట్లు స్థల పురాణం చెబుతున్నది. గర్భాలయంలో సీతాదేవితో కలిసి శ్రీరాముడు దర్శనమిస్తాడు.

### సరయూ ఘాట్

అయోధ్యకు వెళ్లే వారి తప్పనిసరిగా సరయూ ఘాట్‌ను తప్పకుండా సందర్శించాల్సిందే. ప్రతి సంవత్సరం రామనవమి, దీపావళి, విజయదశమి వంటి పర్వదినాలలో వేలాది మంది ప్రజలు సరయూ నది ఒడ్డుకు వస్తుంటారు. ఈ నది గురించి పురాతన హిందూ గ్రంథాల్లోనూ ప్రస్తావించారు. శతాబ్దాలుగా యాత్రికులు, పర్యాటకులను ఆకర్షిస్తోంది. అయోధ్య పట్టణాన్ని ఆనుకొని ప్రవహిస్తుంది. ఈ నదిలోనే రామలక్ష్మణులు అవతారాలు చాలించారని భక్తుల విశ్వాసం. ఈ నదిని గోగ్రానది అని సైతం పిలుస్తుంటారు.

### తులసీ భవన్..

రామచరితమానస్, హనుమాన్ చాలీసాను రచించిన గోస్వామి తులసీదాస్ జ్ఞాపకార్థం నిర్మించారు. తులసీ స్మారక్ భవన్‌లో అయోధ్య శోధ్ సంస్థాన్ (అయోధ్య పరిశోధన కేంద్రం)గా ఉంది. అయోధ్య నగరం సాంస్కృతిక, ఆధ్యాత్మిక, సాహిత్య సంప్రదాయాలను అధ్యయనం చేస్తుంది. అయోధ్యలో రామచరిత్ మానస్ రచయిత, సాధువు కవి గోస్వామి తులసీదాస్ జీకి అంకితం చేసిన స్మారక చిహ్నం కూడా కొలువై ఉంది. దీనినే తులసి స్మారక్ భవన్ అని పిలుస్తారు. ఇక్కడ ప్రార్థనలు, భక్తి సంగీతం, నాటకాలు, రాంలీలా, రామకాంత పారాయణ, తదితర కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహిస్తారు. ఈ భవనంలో ఉన్న అయోధ్య రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో గోస్వామి తులసీదాస్ సాహిత్య రచనల పెద్ద భాండాగారం సైతం ఉన్నది.

### నాగేశ్వరనాథ్ ఆలయం

అయోధ్య రామాలయం సందర్శించిన అనంతరం ఇక్కడే కొలువైన నాగేశ్వర్ నాథ్ ఆలయాన్ని సైతం తప్పకుండా దర్శించుకోవాలి. శ్రీరాముడు స్వయంగా శివలింగాన్ని ప్రతిష్టించించిన ఆలయమే ఈ నాగేశ్వరనాథ్ ఆలయమని స్థలపురాణం చెబుతున్నది. ఆలయంలోని శివలింగానికి భక్తులు సరయూనది నుంచి నీటిని తీసుకువచ్చి అభిషేకం చేస్తుంటారు. ఈ ఆలయాన్ని రాముడి కుమారుడు కుశుడు నిర్మించాడని ప్రతీతి. 1750 లో నవాబ్ సఫ్దర్ జంగ్ మంత్రి నావల్ రాయ్ ఈ ఆలయాన్ని పునరుద్ధరించారు. ఈ ఆలయాన్ని సందర్శించడానికి సరైన సమయం శివరాత్రి. ఇక్కడ శివరాత్రి పర్వదినాన్ని ఘనంగా నిర్వహిస్తారు. ఆ రోజున శివుడి బరాత్ (ఊరేగింపు) సైతం జరుపుతారు.అయోధ్య ఆధ్యాత్మిక ప్రదేశాలతో పర్యాటక ప్రాంతాలు సైతం ఉన్నాయి. ఇందులో ఒకటి గులాబ్ బారీ. నగరంలోని అత్యంత అందమైన తోటల్లో ఒకటిగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడి పచ్చదనం పర్యాటకుల్ని ఎంతగానో ఆకట్టుకుంటుంది. 8వ శతాబ్దంలో ఈ తోటలో అనేక రకాల రంగురంగుల గులాబీ మొక్కలను నాటారు. ఇక్కడ 1753–1775 మధ్య అయోధ్యను పాలించిన పాలించిన అవధ్ మూడో నవాబ్ అయిన షుజా–ఉద్–దౌలా సమాధి ఉంటుంది. దేశంలోని అన్ని ప్రాంతాలలకు చెందిన ప్రకృతి ప్రేమికులను, వృక్షశాస్త్రజ్ఞులను గులాబీలు ఆకర్షిస్తాయి. ఇస్లామిక్ నిర్మాణ శైలి సమాధి ఉంటుంది. గార్డెన్‌లోకి ప్రవేశించగానే భారతదేశ జాతీయ చిహ్నంతో కూడిన పెద్ద స్తంభం అందరికీ స్వాగతం పలుకుతుంది. గార్డెన్‌లో అందమైన మసీదు, దాని పక్కనే చిన్న వాచ్‌టవర్ ఉన్నది. సమాధి వంపు మార్గాల గుండా నడస్తూ వెళ్తుంటే ఆ అనుభూతే వేరు.అయోధ్యలో ప్రకృతి సౌందర్యంతో నిండిన చారిత్రక ప్రదేశాల్లో మోతీ మహల్ ఒకటి. చారిత్రక, సాంస్కృతిక ప్రాముఖ్యత కలిగిన ఫైజాబాద్‌లో ఉన్న ఒక స్మారక చిహ్నం. చాలా మంది మోతీ మహల్‌ను 'పెర్ల్ ప్యాలెస్' అని కూడా పిలుస్తుంటారు. మోతీ మహల్ అయోధ్య పట్టణానికి కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉంది. 1743 ఏడీలో నిర్మించబడిన ఈ ప్యాలెస్ అప్పటి నవాబ్ షుజా–ఉద్–దౌలా భార్య రాణి బేగం ఉన్మతుజ్జోహ్రా బాను నివాసంగా ఉండేది. మొఘల్ వాస్తుశిల్పకళ భవనంలో అద్భుతంగా నిలుస్తుంది.

Editor, Printed, Published and Owned by Shaik Nazeer Ahmed Basha , H.NO. 3-104- 2 , Balajinagar, Kurnool - 518006, (A.P) , Printed at GK PUBLICATIONS , D.NO. 27/66, CHINNA MARKET, DIST. KURNOOL- 518001, ANDHRA PRADESH. E-mail : seemakiranamknl@gmail.com. RNI : APTEL / 2O18/ 76380, Cell : 9133399830, 8919971019. website : - www.seemaakiranam.com , www.seemakiranamnews.com , epaper.seemakiranamnews.com